INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

శనివారం 10.08.2024
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 32 సంచిక -175 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## ఉపాధి హామీ నిధులు



**● రూ.2812.98 కోట్లు మంజూరు చేసిన కేంద్రం**

**● ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంటే 2024-25లో మదర్ శాంక్షన్ కింద కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి హామీ వేతనాల చెల్లింపుల నిమిత్తం 21.5 కోట్ల పనిదినాలకు గానూ రూ.5743.90 కోట్లను మంజూరు చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. కాగా గతంలో ఆమోదించిన 15 కోట్ల పని దినాలకు సంబంధించి వేతన నిధులు రూ.2934.80 కోట్లు మంజూరు చేసి.. విడుదల చేసిందనీ, అదనంగా ఇప్పుడు రూ.2812.98 కోట్లను మంజూరు చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2809.10 కోట్లు రోజువారీ వేతన ఎఫ్.టి.ఓ.ల అప్ లోడ్ ఆధారంగా నేరుగా వేతనదారుల ఖాతాలకు జమ అయ్యాయని, మిగిలిన మొత్తాలు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరలోనే వేతనదారుల ఖాతాలకు జమ అవుతాయని పవన్ కళ్యాణ్ తెలిపారు.

## త్వరలోనే కొత్త రేషన్ కార్డులు



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీకి లక్ష టన్నుల కందిపప్పు కేటాయించాలని కేంద్రాన్ని కోరామని ఆ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. దేశవ్యాప్తంగా కందిపప్పు కొరత వేధిస్తున్నా ఏపీలో కంది పప్పు రూ.150కే అందిస్తున్నామి చెప్పారు. నవంబర్ నాటికి కందిపప్పు సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. గిడ్డంగుల నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో సింహభాగం ఇవ్వాలని కోరామన్నారు. కేంద్ర రాష్ట్ర మార్కెటింగ్ శాఖలు నిర్వహించే ప్రైస్ మానిటరింగ్ సెంటర్లను ఇప్పుడు ఉన్న 5 నుంచి 13కి పెంచాలని కోరామని తెలిపారు.
ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, హర్దీప్ సింగ్ పూరీలతో సమావేశమయ్యారు. అనంతరం ఆంధ్ర భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. విభజన వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. రేషన్ కార్డుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించే ఎన్ఎఫ్ఎస్ఏ ప్రకారం రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. విభజన జరిగినప్పుడు జనాభా ప్రతిపాదికన కాకుండా.. 2001 సెన్సెక్స్ ప్రకారం కేటాయించారు. దీంతో ఏపీకి రేషన్ కార్డులు బాగా తగ్గిపోయాయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.47 కోట్ల కుటుంబాలకు ఆటంకం లేకుండా ప్రతి నెలా రేషన్ సరఫరా చేస్తున్నామని తెలిపారు.
రేషన్ డోర్ డెలివరీ అంటూ వైసీపీ ప్రభుత్వం రూ.1800 కోట్లు వృథా చేసిందని నాదెండ్ల మనోహర్ అన్నారు. రేషన్ డోర్ డెలివరీపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హత ఉన్న వారికి త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందిస్తామని పేర్కొన్నారు. టార్గెట్ అంటూ ఏమీ లేదని స్పష్టం చేశారు. రేషన్ బియ్యాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా అక్రమంగా తరలించి కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు.

## ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తాం



**● వైసీపీ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం**

**● మంత్రి నారాయణ**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైసీపీ ఐదేండ్ల పాలనలో ప్రజాధనం దుర్వినియోగమయిందని ఏపీ మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఎంతటి వారినైనా విడిచిపెట్టేది లేదని, వారిని విచారిస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. తణుకులో టీడీఆర్ బాండ్ల లో రూ.700 కోట్ల అవినీతి జరిగినట్లు తేలిందని అన్నారు. ఈ అక్రమాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే విచారణ కమిటీ వేశాం. నివేదిక కూడా వచ్చింది. సీఎంతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న లేఅవుట్ ఇళ్ల నిర్మాణంపై అనేక వినతులు వస్తున్నాయని, వీటిపై విచారణ జరిపి లబ్దిదారులకు తగిన రీతిలో న్యాయం చేస్తామని వెల్లడించారు. ఏపీలో కూటమిది ప్రజాపాలన ప్రభుత్వమని, ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజా వినతులపై సీఎం చంద్రబాబు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కార ప్రత్యేక వేదికలో చాలా మంది వినతులతో వస్తున్నారని, తమ దృష్టికి వస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

## ఇక ఆదివాసుల అభివృద్ధి



**● సమగ్ర ప్రణాళికతో ఆదివాసీల్లో పేదరికం రూపుమాపుతాం**

**● ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ గురించి మాట్లాడుకునే రోజుల్లో డోలీ మోతలు కనబడటం బాధాకరం..ఆ పరిస్థితి మారుస్తాం**

**● గిరిజన విద్యార్థుల కోసం విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్ల ఏర్పాటు**

**● 2,191 గ్రామాలకు రోడ్ కనెక్టివిటీ కల్పిస్తాం**

**● రూ.2,373 కోట్లతో ప్రతి గిరిజన కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు**

**● అరకు కాఫీతో పాటు ఆర్గానిక్ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం**

**● పాడేరులో మెడికల్ కాలేజీని రూ.500 కోట్లతో పూర్తి చేస్తాం**

**● లంబసింగిలో స్వాతంత్ర్య సమరయోధుల కోసం మ్యూజియం ఏర్పాటు**

**● ప్రపంచ ఆదివాసీ దినోత్సంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**● గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేసిన సీఎం...అడవి తల్లికి చీర సమర్పించిన చంద్రబాబు**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** 'గిరిజనులు పేదరికంలో పుట్టి పేదరికంలోనే చనిపోతున్నారు. పేదరికం లేని సమాజాన్ని మనం నిర్మించుకోవాలి. ఏ పని చేసినా పేదలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆదివాసీల్లో పేదరికం ఎక్కువగా ఉంది...వారిని అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు నేను తప్పకుండా శ్రద్ధ తీసుకుంటా. రాబోయే ఐదేళ్లలో నిర్థిష్ట ప్రణాళికతో పేదరికాన్ని తగ్గిస్తాం. పేరుకు పథకాలు ఇవ్వడం కాదు...వాటి ఫలితాలు ఇచ్చేలా ఉండాలి. చేసే ప్రతి ఒక్క పనితో గిరిజనుల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొస్తాం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో డోలీ మోతలు కనబడటం చాలా బాధగా ఉంది. నేను రాజకీయ వివక్ష చూపించను...కక్ష సాధింపులకు పాల్పడను. కానీ రాష్ట్ర ప్రజల ఖజానాను, ఆస్తులను దోచిన వారిని శిక్షిస్తా. దోచిన సొమ్మును రికవరీ చేసి పేదలకు ఖర్చు పెడతా. ఈ రోజు నుండి చైతన్యం 2.0 ప్రారంభమైంది. ఈ 2.0 చైతన్యం ఎక్కడ పేదవాడుంటే అక్కడికొచ్చి మీకు కావాల్సిన వనరులు ఇచ్చి పేదరికం నుండి బయటకు తీసుకొస్తాం. మీ జీవితాల్లో వెలుగులు రావాలని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఆదివాసీలు పండించే ఉత్పత్తులు, తయారు చేసే కళాకృతులను పరిశీలించారు. అరకు కాఫీని తాగారు. స్వాతంత్రోద్యమంలో ఆదివాసీల పాత్ర, చరిత్రను తెలియజేసేలా రూపొందించిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. ఆదివాసీ చీరను అడవి తల్లికి సమర్పించారు. అనంతరం ఆదివాసీలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

**డీఎస్సీ రాసే గిరిజన అభ్యర్థుల కోసం శిక్షణా కేంద్రాలు**

'ఇటీవల 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాం. డీఎస్సీకి పోటీ పడే గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తాం. గిరిజన విద్యార్థుల కోసం విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తాం. ఆదివాసీల్లో అనేక కళలున్నాయి%ొ%అరకు గిరిజన నృత్యం దేశంలోనే ప్రత్యేకమైంది. అనేక కళలున్న ఆదివాసీలు చాలా రంగాల్లో వెనకబడి ఉన్నారు. ప్రతి యేడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని జీఓ నెంబర్ 123ను నాడు తెలుగుదేశం ప్రభుత్వంలోనే విడుదల చేసి నిర్వహించాం. కానీ గత ప్రభుత్వం ఆదివాసీ

2లో

## రావణాసురుడే రామాయణం చెప్పినట్లుగా జగన్ మాటలు :మంత్రి



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. రావణాసురుడు రామాయణం చెప్పినట్లుగా వైఎస్ జగన్ మాటలు ఉన్నాయని విమర్శించారు. జగన్‌కు చేసిన తప్పులు పగలు-రాత్రి గుర్తొస్తుండటంతో ఎక్కడ ఎరుపు రంగు కనిపించినా రెడ్ బుక్కే గుర్తుకొస్తుందని అన్నారు. కక్షలు, వేధింపులు, అరాచకాలు, హింస పేర్లు వింటే అందరికీ జగనే గుర్తుకొస్తాడని

2లో

## జగన్ చరిత్ర అంతా రక్త చరిత్రే

**● వైసీపీ పాలనలో 2,686 హత్యలు**

**● మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ఆరోపించారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల నంద్యాల జిల్లా సీతారామపురంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఒకరు చనిపోతే ఉనికి కోసం హత్యను రాజకీయాలకు వాడుకుంటున్నారని జగన్ పై మండిపడ్డారు.
చంద్రబాబుపై కేసు పెట్టాలని జగన్ డిమాండ్ చేయడం శోచనీయమని ఆరోపించారు. వైసీపీ పాలనలో 2,686 హత్యలు జరిగాయని, ఆయనపై కూడా కేసులు పెట్టాలని పేర్కొన్నారు. జగన్ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రేనని విమర్శించారు. వైఎస్ వివేకానందా రెడ్డి హత్యను ప్రశ్నిస్తున్న మీ చెల్లెలు సునితా రెడ్డికి సమాదానం చెప్పాలన్నారు.
భారతదేశంలోనే వైఎస్ జగన్ లాంటి క్రిమినల్ లీడర్ లేరని జాతీయ మీడియా సంస్థ పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. సీబీఐ కోర్టుకు వెళ్లకుండా ప్రతి శుక్రవారం ఏదో ఒక కార్యక్రమం అంటూ తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడు కూడా హత్య రాజకీయాలను ప్రోత్సహించరని స్పష్టం చేశారు. ఇకనైనా హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకొవాలని మంత్రులు జగన్‌కు సూచించారు. నంద్యాలలో కానిస్టేబుల్ సురేంద్ర మర్డర్, అబ్దుల్ సలాం సూసైడ్ ఘటనలు జరిగినప్పుడు జగన్ నంద్యాలకు ఎందుకు రాలేదు? అని ఎమ్మెల్యే అఖిల ప్రియ ప్రశ్నించారు.



### పారిశ్రామిక అభివృద్ధి...
## ఉపాధి కల్పనే లక్ష్యం

**● ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నాం**

**● రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్**

**● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డితో కలిసి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌ను పరిశీలించిన మంత్రి భరత్**

**● జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి యాజమాన్యం, పరిశ్రమల శాఖ అధికారులతో మంత్రి సమావేశం**



కర్నూలు ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి

2లో

## వైసీపీకి మాజీ మంత్రి ఆళ్ల నాని రాజీనామా



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీలో అధికారం కోల్పోయినప్పటి నుంచి వైసీపీ కి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన నేతలు రాజీనామా బాట పడుతున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు రాజీనామా చేసిన 48 గంటల్లో మరో మాజీ మంత్రి పార్టీకి రాజీనామా చేశారు.
శుక్రవారం ఏలూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ వైసీపీకి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వైఎస్ జగన్ కు రాజీనామా లేఖను పంపించారు. కొన్ని రోజులపాటు రాజకీయాలకు దూరంగా ఉండడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.
ఆళ్ల నాని 1994, 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏలూరు శాసనసభ నుంచి పోటీ చేసి ఓడిపోయాడు. 2004, 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచాడు. 2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరి పోటీ చేసి ఓడిపోయాడు. 2019లో పోటీ చేసి గెలుపొందడంతో వైఎస్ జగన్ మంత్రివర్గంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పనిచేశాడు. మొన్నటి 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య చేతిలో ఓటమి పాలయ్యారు.

## గత ఐదేళ్ల పాలనలో ఆర్టీసీని నాశనం చేశారు

**● ఆర్టీసీ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**● విలీనం పేరుతో ఆర్టీసీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడారు**

**● మచిలీపట్నం బస్ స్టాండ్‌లో కనీస సదుపాయాలు కూడా కల్పించలేదు**

**● గత ప్రభుత్వం లో రవాణా మంత్రిగా ఉండీ మచిలీపట్నానికి చేసిందేమీ లేదు**

**● నూతనంగా కొనుగోలు చేసిన ఐదు బస్సుల్ని ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) : రాష్ట్ర రవాణా రంగాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం బస్టాండు వద్ద నూతనంగా కొనుగోలు చేసిన బస్సుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు గజమాలతో సత్కరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రిబ్బన్

2లో

# జగన్ పేరు తొలగింపు ఘటనతో ప్రభుత్వానికి సంబంధం లేదు

## వైసీపీపై మంత్రి డోలా ఫైర్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విజయవాడ స్వరాజ్య మైదానంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ మహాశిల్పం పీఠంపై ఏర్పాటు చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరును గురువారం రాత్రి తొలగించడం సంచలనంగా మారింది. ఈ దాడిని నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం దగ్గర వైసీపీ నాయకులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఉండకూడదనే టీడీపీ నేతలు దాడి చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూలగొట్టే అవకాశం ఉందన్నారు. వెంటనే దాడి ఘటనపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
చంద్రబాబు, నారా లోకేశ్ ప్రమేయంతోనే అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. ఈ దాడి దురదృష్టకరమని.. అంబేడ్కర్ విగ్రహంపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని.. దాడి ఘటనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇది అంబేడ్కర్ విగ్రహంపై దాడి కాదని.. ప్రజాస్వామ్యంపై దాడి అని పోతిన మహేశ్ విమర్శించారు. ఈ దాడిలో టీడీపీ నేతల హస్తం ఉందని అన్నారు. అధికారుల అండదండలతో దాడి చేశారని, వెంటనే ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
కాగా, ఈ ఘటనపై వైసీపీ రాద్ధాంతం చేస్తుందని మంత్రి డోలా బాలావీరాంజనేయ స్వామి విమర్శించారు. జగన్ పేరు తొలగింపు ఘటనతో



ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆగంతకులు చేసిన పనిని ప్రభుత్వానికి అంటగడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ నీచ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు తీసి జగన్ పేరు పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ పేరు తొలగించినప్పుడు వైసీపీ దళిత నేతలు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అంబేడ్కర్ గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

# ఇక ఆదివాసుల అభివృద్ధి



(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవాన్ని నిర్వహించడం మానేసింది. మన దేవానికి రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఉన్నారు, ఆమెను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. పాఠశాలలో ఉపాధ్యాయిరాలిగా పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రపతి అయ్యారంటే అదీ ఆదివాసీల్లో ఉండే ప్రతిభ. ఆదివాసీలు అనగానే శౌర్యం, ప్రతిభ, నైపుణ్యం కలిగి ఉంటారు. ప్రకృతిని ఆరాధిస్తారు. ఎగ్జిబిషన్ లో ఏకలవ్యుడి ఫోటోలు చూశాను. గిరిజన కుటుంబంలో పుట్టాడు. విలువిద్యను అందించేందుకు గురువులు నిరాకరిస్తే పట్టుదలతో విద్యనభ్యసించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అలాంటి వ్యక్తి గిరజనుల్లో పుట్టుడం అదృష్టం. వ్యవసాయం, హస్తకళలు, నృత్యం, సంప్రదాయ ఆహారాలను గిరిజనులు పాటిస్తున్నారు. వాటిద్వారా అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం పోరాటంలో ఆదివాసీలు పెద్దఎత్తున పోరాడారు. బిర్సాముండా, తాత్యాబిల్, మన తెలుగువారైన కొమరం భీం లాంటి వాళ్లు బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. అల్లూరి సీతారామరాజు మీ అండతోనే బ్రిటిష్ వారి ఆధిపత్యాన్ని అంతం చేయడానికి పోరాడి ప్రాణత్యాగం చేశారు. అందుకే దేశానికే ముద్దబిడ్డగా మిలిగిలారు. మీ త్యాగాలు, మీ మద్దతు జాతి మరవదు. దేశంలో 10.42 కోట్ల మంది గిరిజనులున్నారు. రాష్ట్రంలో 5.56 శాత మంది ఉన్నారు.' అని సీఎం వివరించారు.

**ఆదివాసీలు వెనకబాటుతనంపై సమగ్ర అధ్యయనం**

'మీలో అనేక కట్టుబాట్లు ఉన్నాయి. మైదానంలో ఉండే వారి జీవన ప్రమాణాలు తక్కువగా ఉన్నాయి...ఏజన్సీలో ఉండే వారికి కనీసం రోడ్లు కూడా సరిగా లేవు. సమైఖ్య రాష్ట్రంలో చైతన్యం అనే కార్యక్రమం పెట్టి పెనుమార్పులకు శ్రీకారం చుట్టాం. మైదాన ప్రాంతాల్లో ఉండేవారి కంటే ఏజన్సీలో ఉండేవారికి వనరులు ఎక్కువ అందుబాటులో ఉంటాయి. అరకు కాఫీని ప్రమోట్ చేశాం. అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను అందింపుచ్చుకున్నాం. చాలామంది అర్గానిక్ ఆహార ఉత్పత్తులను పండిస్తున్నారు. ఎక్కడా దొరకని తేనె మన ప్రాంతాల్లో దొరుకుతోంది. కాఫీకి ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా వ్యాపారంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు సాగును ప్రోత్సహించాం. ప్యారిస్ లో కూడా ప్రస్తుతం అ-రకు కాఫీ అమ్ముతున్నారు. కొన్ని పెద్ద పత్రికలు కూడా అరకు కాఫీ గురించి రాస్తున్నాయి. వ్యవసాయంలో అరకు కాఫీ కూడా భాగమని కథనాలు రాస్తున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ కూడా గతంలో అరకు కాఫీకి బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్నారు. ఆదివాసీల మహిళలు డ్వాక్రా సంఘాల్లో కూడా ఉన్నారు. పేద మహిళలను సంఘటిత శక్తిగా మార్చాలని నాడు ఆలోచించాను. మారుమూల ప్రాంతాల్లోని ఆడబిడ్డలు చేసే కుల, చేతివృత్తులను ప్రోత్సహించాం. మల్టీ గ్రెయిన్ బిస్కెట్ల తయారీని ప్రోత్సహించాం. ఏ పని చేసినా అనునిత్యం సాధన చేస్తూ నైపుణ్యం పెంచుకుంటే ఆదాయం వస్తుంది. కానీ ప్రభుత్వం నుండి ఆధారం లేకపోవడంతో దెబ్బతిన్నారు. ఆదివాసీలు ఎందుకు వెనకబడి ఉన్నారో అధ్యయనం చేస్తున్నా'నని అన్నారు.

**గత ప్రభుత్వం దుర్మార్గంగా 16 సంక్షేమ పథకాలు రద్దు చేసింది**

'స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లైంది. చాలా వర్గాలు అభివృద్ధి చెంది ముందుకెళున్నాయి. కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆర్థికంగా వెనకబడి ఉన్నారు. ఆదివాసీల్లో పుట్టిన పిల్లలతో పాటు తల్లులు కూడా చనిపోతున్నారు. ఈ సంఖ్యను తగ్గించాలి. పిల్లల సంఖ్య తగ్గితే వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. మన పిల్లలే మనకు ఆస్తి. వారిని బాగా చదివిస్తే మనం కష్టంలో ఉన్నప్పుడు చూసుకుంటారు. దేశంలో తలసరి ఆదాయం రూ. 1.72 లక్షలు ఉంటే ఏపీలో రూ. 2.20 లక్షలు ఉంది. కానీ ఆదివాసీల్లో రూ. 1.20 లక్షలే ఉంది. పేదల జీవన ప్రమాణాలపై శ్రద్ధ పెడతాం. అన్ని విధాలా పైకి తీసుకొస్తాం. తెలుగుదేశం పార్టీ హయాంలో 16 పథకాలు తీసుకొచ్చాం. 199 గురుకులాలు తీసుకొచ్చాం. 2,705 విద్యాసంస్థల్లో ప్రస్తుతం 2,45,380 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆదివాసీల్లో విద్యాభ్యాసం తక్కువగా ఉందని ఆలోచించిన ఎన్టీఆర్ ఏ ఊరిలో స్కూలు కావాలంటే ఆ ఊరిలోనే స్కూలు నిర్మించారు. గురుకుల పాఠశాలలు తీసుకొచ్చారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులే ఉపాధ్యాయులుగా ఉండాలని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. మీ పిల్లల విద్య కోసం 2014-19లో రూ. 450 కోట్లు ఖర్చు చేస్తే గత ప్రభుత్వం సగం కూడా ఖర్చు చేయలేదు. గిరిజన పిల్లలు అటవీ ప్రాంతాలకు పరిమితం కాకూడదని ఐఏఎస్, ఐఐఎంలలో చదవాలని శ్రద్ధ పెట్టాం. సివిల్ సర్వీస్ కోచింగ్ కు వెళ్లేందుకు 1000 మందికి రూ. 13 కోట్లు ఖర్చు చేశాం. కానీ గత ప్రభుత్వం రూ. 3 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టి ముగ్గురికే ట్రైనింగ్ ఇచ్చింది. గిరిజనుల్లో ప్రతిభ ఉంది...దాన్ని సానబెట్టి బయటకు తీయాలి. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి విదేశాల్లో చదువుకునేందుకు రూ. 15 లక్షల చొప్పున సాయం అందించి 55 మందిని విదేశాలకు పంపాం. దీనికోసం రూ. 7.5 కోట్లు ఖర్చు పెట్టాం. కానీ గత ప్రభుత్వం అంబేద్కర్ పేరు తొలగించి జగన్ పేరు పెట్టుకుని ఒక్కరికి మాత్రమే విదేశీ విద్యను అందించింది. బెస్ట్ అవైలబుల్ స్కూళు, కార్పొరేట్ స్కూళ్లలో చదువించుకునేవారి కోసం ప్రభుత్వం నుండి ఫీజులు చెల్లించాం. గిరిపుత్రిక కింద 9,222 మంది గిరిజన యువతులకు రూ. 56 కోట్లు పెళ్లికానుక అందించాం. దాన్ని కూడా గత ప్రభుత్వం నీరుగార్చింది. గిరిజనులు చనిపోతే రూ. 5 లక్షలు ఆర్థిక సాయం బీమా ద్వారా అందించాం. రహదారి సదుపాయం లేని ప్రాంతాల నుండి ఆసుపత్రులకు డోలీల్లో వెళ్తున్నారని గుర్తించి ఫీడర్ అంబులెన్సులు తీసుకొచ్చాం. కానీ గత ప్రభుత్వం వాటిని కూడా నిర్వీర్యం చేయడంతో మళ్లీ డోలీల్లో మొసుకొచ్చే పరిస్థితికి తీసుకొచ్చింది. డోలీల్లో తీసుకొచ్చే సమయంలో ప్రసవం అవుతున్నారంటే ఏంటి ఈ దౌర్భాగ్యం.? ఆధునిక యుగంలో ఉన్నాం...అయినా డోలీల్లో తీసుకొస్తున్నారంటే అందరూ బాధపడాలి. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగితే మాతా, శిశు మరణాలు తగ్గుతాయి. సరైన పౌష్టికాహారం అందించేందుకు బాలింతలు, పిల్లలకు ఫుడ్ బాస్కెట్ ప్రవేశపెట్టాం. దోమల బెడద నుండి తప్పించుకోవడానికి దోమ తెరలు అందించాం. ట్రైకార్ ద్వారా ఉపాధి, భూమి కొనుగోలుకు రూ. 685 కోట్లు ఖర్చు చేశాం. గిరిజన ప్రాంతాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటు చేశాం. మేము ఉచితంగా కరెంట్ ఇస్తే దాన్ని కూడా గత ప్రభుత్వం రద్దు చేశారు. బాక్సైట్ తవ్వకాలు నిలిపేస్తే లేట్ రైట్ పేరుతో తవ్వకాలు చేశారు' అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు.

**లంబసింగిలో మ్యూజియం ఏర్పాటు**

'ఆరోగ్య, ఆర్థికంతో పాటు కుటుంబానికి కావాల్సిన వసతులపై సమగ్ర విధానం తీసుకొస్తాం. ఇంకా విద్యుత్తు, మరుగుదొడ్లతో పాటు తాగునీరు లేని గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో ప్రతి ఇంటికీ కనీస అవసరాలు కల్పిస్తాం. గిరిజన వాడల్లో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. పాఠశాలకు పిల్లలందరూ వెళున్నారో లేదో కూడా సమీక్ష చేస్తాం. గ్రామంలోని వనరులు ఉపయోగించి ఆదాయం పెంచే మార్గం చూపిస్తాం. ట్రైకార్ ద్వారా రుణాలు ఇస్తాం. 2014-19 మధ్య ఇచ్చినట్లుగానే ఇన్నోవా కార్లు అందిస్తాం. గతంలో 80 స్కూళ్లను రెసిడెన్సియల్ స్కూళ్లుగా మార్చాం...వాటి కోసం కొత్త భవనాలు నిర్మిస్తాం. గిరిజనుల్లోని సమరయోధుల త్యాగాలను తెలియజేసేందుకు లంబసింగిలో మ్యూజియం ఏర్పాటు చేస్తాం. గ్రామ సచివాలయాల్లో పని చేసే ఏఎన్ఎంలను ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో పెట్టి పిల్లల ఆరోగ్యాన్ని పరీక్షించేలా చేస్తాం. దేశంతో పాటు, ప్రపంచంలోని ముఖ్య నగరాల్లో అరకు కాఫీని ప్రమోట్ చేసి మరింత గుర్తింపు తీసుకొస్తాం. అరకు కాఫీ నాణ్యతను పెంపొందిస్తాం. వాణిజ్య పంటల కంటే కాఫీ పంటకు ఆదాయం అధికంగా వచ్చేలా చేస్తాం. మీరు పండించే ఆర్గానిక్ పంటల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తాం. తయారు చేసే వస్తువులను ఓఎన్డీసీ ఫ్లాట్ ఫాం ద్వారా వినియోగదారులకు నేరుగా వినియోగించేలా చేస్తాం. జీవో నంబర్ 3 నాకు బాగా గుర్తు ఉంది...నేనే తీసుకొచ్చా. విశాఖలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఉపఎన్నికలు ఉండటం వల్ల మాట్లాడలేకపోతున్నా...మీ పిల్లల భవిష్యత్తుకు ఏం చేయాలో అదంతా చేస్తా. సీతంపేట ఐటీడీఏలో రూ. 7 కోట్లతో సమగ్ర పసుపు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ ను రూ. 2.54 కోట్లతో అభివృద్ధి చేస్తాం. పార్వతీపురం ఐటీడీఏ కొమరాడ మండలంలోని పూర్ణపాడు-లాబేసు గ్రామాల మధ్య నాగావళి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తాం. చింతూరు ఐటీడీఏ పరిధిలో 11 ఎత్తిపోతల పథకాలను రూ. 2.5 కోట్లతో నిర్మిస్తాం. పాడేరులో మెడికల్ కళాశాలను రూ. 500 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేస్తాం. 418 ఏకోపాధ్యాయ పాఠశాలలకు రూ. 50 కోట్లతో భవనాలు పూర్తి చేస్తాం. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో ప్రధాన కేంద్రంలో మూడు ప్రధాన రహదారుల కారిడార్ ను రూ. 50 కోట్లతో పూర్తి చేస్తాం. పాడేరు ఏజన్సీలో రూ. 10 కోట్లతో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తాం. 2,191 గిరిజన గ్రామాలకు త్వరలో రోడ్డు మార్గాలు నిర్మిస్తాం. 16,816 గిరిజన నివాస ప్రాంతాలకు తాగునీరు లేదు, ఆ ప్రాంతాలకు కుళాయి ద్వారా నీళ్లు అందిస్తాం.' అని సీఎం హామీల వర్షం కురిపించారు.

**మీ భూములు దోచుకునేందుకు గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని రద్దు చేశాం**

'ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మీకు శుభాకాంక్షలు తెలపడమే కాదు...నిర్ధిష్ట ప్రణాలికతో అభివృద్ధి చేస్తాం. అరకు పార్లమెంట్ పరిధిలో 5 స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించారు. మంచి పనులు జరగాలంటే ఆలోచనా విధానం కూడా మారాలి. మొన్నటి ఎన్నికల్లో సుడిగాలి వచ్చింది...ఆ సుడిగాలిలో తిరిగి రానంతగా జగన్ కొట్టుకుపోయారు. దీనికి కారణం అవినీతి, దోపిడీ, పేదల పొట్టకొట్టే పాలకులు ఉండటమే. ఇక్కడుండే వారిని అడుగుతున్నా....గత ప్రభుత్వంలో ఎవరికైనా న్యాయం జరిగిందా.? మీకు ఒక్కరుణమైనా ఇచ్చిందా.? మీ పిల్లల భవిష్యత్తు ను నిర్వీర్యం చేశారు. గిరిజనులపై దౌర్జన్యాలు చేసి కేసులు పెట్టారు. అందుకే నిశ్శబ్ద విప్లవం వచ్చి ఎవరూ ఊహించని విధంగా 93 శాతం స్థానాలు కూటమికి వచ్చాయి. మీరు అనేక కష్టాలు అనుభవించారు. వైసీపీ ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేసింది..వాటికి ప్రతి నెలా వడ్డీలు కట్టాలి. ఇప్పటికే కొన్ని పథకాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల ముందు చెప్పిన విధంగానే పింఛను రూ. 3 వేల నుండి రూ. 4 వేలకు పెంచి పెద్దకొడుకుగా ఉన్నా. వాలంటీర్ల లేకుంటే పింఛన్లు ఇవ్వలేరని చెప్పి 35 మంది వృద్ధుల ప్రాణాలు తీశారు. కానీ మనం ఒక్కరోజులోనే 97 శాతం మందికి పింఛన్లు అందించాం. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి తెలుగుదేశం పార్టీకి ఉంది. ఆగస్టు 15న అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లోని అన్ని మండలాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తాం. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా మీ భూములను దోచుకోవాలని చూశారు. అందుకే ఆ చట్టాన్ని రద్దు చేశాం.' అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ నేను దేనికి భయపడను : శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్



నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్) :జగన్ పాలనలో ఎంతో మంది హత్యలు చేసి ఆయన పక్కన కూర్చున్న వారు చాలా మంది ఉన్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. జగన్ తన కాల్ డేటా తీయాలని అంటున్నారని. తనతో పాటు తన అనుచరుల నంబర్స్ కూడా ఇస్తానని సవాల్ విసిరారు. కాల్ డేటాను జగన్ బయటకు తీయించాలని అన్నారు. తనకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. బండి ఆత్మకూరుకు చెందిన ఓ ముస్లిం మహిళను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అనుచరులు అత్యాచారం చేస్తే జగన్ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. తాను మాట్లాడిన వీడియోను మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని జగన్ అంటున్నారని.. ఆ పూర్తి వీడియో పంపిస్తాను. జగన్ ఆ వీడియో చూడాలని చెప్పారు. సీతారామాపురంలో రెండు వర్గాల మధ్య వైసీపీ నేత శిల్పా చక్రపాణి రెడ్డినే గొడవ పెట్టారని.. సుబ్బరాయుడు హత్యకు కారకుడు కూడా శిల్పా చక్రపాణి రెడ్డినేనని తేల్చిచెప్పారు. తనపై కేసు పెట్టాలని జగన్ డిమాండ్ చేస్తున్నారని... కేసులకు భయపడే వ్యక్తిని తాను కాదని స్పష్టం చేశారు. తనపై కేసు నమోదైతే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరణ ఇచ్చుకుంటానని తెలిపారు. జగన్ నంద్యాలకు వచ్చారని.. వైసీపీ నాయకులు పరదాలు ఎందుకు కట్ట లేదని బుడ్డా రాజశేఖర్ రెడ్డి విమర్శించారు.

## బాలికల విద్యకు ప్రభుత్వంపెద్దపీట



ఎమ్మిగనూరు(జర్నలిస్ట్ ఫైల్) :పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే బీవీకి విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ బాలికల విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

## రావణాసురుడే రామాయణం చెప్పినట్లుగా జగన్ మాటలు :మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు.

ప్రజా తీర్పు ఓర్వలేను అన్నట్లుగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని వైఎస్ జగన్‌పై మంత్రి నిమ్మల విమర్శించారు. నంద్యాల ఘటనలో ఎస్సీల భూమిని వైసీపీ నేత కబ్జా చేశారని ఆరోపించారు. గ్రామ పెద్ద వైసీపీ నేత నారప్ప రెడ్డికి భూమి తిరిగి ఇవ్వమని చెప్పడంతో అతనిపై దాడి చేయించారని చెప్పారు.

రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవను వ్యక్తిగత స్వార్థం కోసం జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి నిమ్మల మండిపడ్డారు. వినుకొండ ఘటనలో అసత్యాలు ప్రచారం చేయడంలో విఫలమై భంగపడిన రీతిలో ఇవాళ నంద్యాలలోనూ జగన్ బోల్తా పడ్డారని విమర్శించారు. శాంతి భద్రతల నిర్వహణలో టీడీపీ ప్రభుత్వం ఎక్కడా రాజీపడదని జగన్ గుర్తించాలని స్పష్టం చేశారు.

## గత ఐదేళ్ల పాలనలో ఆర్టీసీని నాశనం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

కట్ చేసి ప్రారంభించారు. జెండా ఊపి బస్సుల్ని ప్రజలకు అంకితమిచ్చారు. ఆర్టీసీ ఆదాయం పెంచడమే లక్ష్యంగా గతంలో కార్గో సేవల్ని చంద్రబాబు ప్రారంభించారని, ప్రస్తుతం కొత్త బస్సులతో ఆర్టీసీకి సరికొత్త హంగులు జోడించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1500 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించి, తొలివిడతలో 200 బస్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మచిలీపట్నం డిపోకు 5 కొత్త బస్సులు కేటాయించారన్నారు.

విలీనం పేరుతో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల జీవితాలతో గత ప్రభుత్వం చెలగాటం ఆడారు. వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారు. కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు తీసుకున్నారు. అదే సమయంలో గత ప్రభుత్వం చేసిన విధ్వంసం నుండి ఆర్టీసీ వ్యవస్థను బయటకు లాగే ప్రయత్నం చేస్తున్నామన్నారు. నాడు చంద్రబాబు తీసుకున్న కార్గో సేవల నిర్ణయంతో ఆర్టీసీకి మెరుగైన ఆదాయం సమకూరుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ఆడబిడ్డలకు శుభవార్త చెబుతామని, ఉచిత బస్సు ప్రయాణానికి మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

గతంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్నవారు చేసిందేమీ లేదన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపోలో మురుగు నీరు చేరి అవస్థలు పడుతున్నారు. కనీస సదుపాయాలు కూడా లేక ప్రజలు బస్ ప్రయాణమంటేనే భయపడుతున్నారు. ఇప్పటికీ వర్షం వస్తే రోడ్లపై ఉండాల్సిన మురుగు మొత్తం బస్టాండుకు చేరుతోంది. గత ప్రభుత్వ పాపాల నుండి మచిలీపట్నాన్ని కాపాడుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తాననని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

## సచివాలయల ఉద్యోగుల రేషనలైజేషన్ కు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి

○ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయం నందు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష, జిల్లా కార్యవర్గ సభ్యులు శుక్రవారం సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చాంద్ బాష మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే సుమారు లక్షా 60 వేల మంది గ్రామ , వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబందించిన రేషనలైజేషన్ ప్రక్రియకు ముందు ప్రతి శాఖ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు తీసుకొని , ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సీనియారిటీను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, వాళ్ళకు పదోన్నతుల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని, అలాగే వేతన సంరక్షణకు (పే ప్రొటెక్షన్) సంబంధించిన విషయంలో కూడా మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గ్రేడ్ -3 ఏఎన్ఎం లకు వారి మాతృశాఖకు మార్పు చేసిన యెడల , వారందరినీ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ గా పరిగణించి వారికి ఇవ్వాల్సిన అన్ని అలవెన్సులు ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేయాలని, అనవసరపు మొబైల్ యాప్ లను తొలగించి వారికి తీవ్రమైన ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలన్నింటినీ ఆగస్టు 11 న అనగా ఆదివారం జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్య నారాయణ గారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తానని జిల్లా అధ్యక్షులు చాంద్ బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చాంద్ బాషతో పాటు జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రా దేవి, సహాధ్యక్షురాలు హేమలత నగరశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆషా సజిని CPS ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులు కోటా సాహెబ్ రాధాకృష్ణ, రత్తయ్య నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## కీటకజనిత వ్యాధులపై పునఃశ్చరణ తరగతులు నిర్వహణ

○ప్రోలు కొండారెడ్డి ,రాష్ట్ర యంటమాలజిస్ట్ కన్సల్టెంట్



**ఎర్రబాలెం (జర్నలిస్ట్ ఫైల్) :** కీటక జనిత వ్యాధులపై అవగాహన కలిగించుటకు పునఃశ్చరణ తరగతులను రాష్ట్ర ఎంటమాలజిస్ట్ కన్సల్టెంట్ పోలు కొండారెడ్డి గారి అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం గారి నిర్వహణలో ఎర్రబాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమావేశ మందిరము నందు నిర్వహించడం జరిగినది వర్షాకాలం దృష్ట్యా నీటి నిల్వలు ఉండుటవలన దోమలు లార్వాలు తమ సంతతిని అభివృద్ధి చేసుకొని ప్రౌఢ దశలార్వాలుగా అభివృద్ధి చెంది మానవ మనుగడకు అంతరాయం కలుగుతాయని కావున జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిశీలించుకుని దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను మలేరియా చికెన్ గునియా డెంగ్యూ ఫైలేరియా మెదడువాపు వ్యాధులను అరికట్టాలని వాటికి తగులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు ప్రజా బాహుళయంలో వ్యాధికారక దోమ ఒకరి నుండి ఒకరికి కుట్టుట వలన ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ఆరోగ్య శాఖ పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పట్టణాలలో మున్సిపల్ ఆరోగ్య సిబ్బందితో సమాయత్తమై ఈ వ్యాధులను అరికట్టాలన్నారు క్షేత్రస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేసి ఎవరి ఇంటిలో వారు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆరోగ్య సిబ్బంది తో అవగాహన కలిగించాలన్నారు దోమలు కుట్టుట వలన వచ్చే వ్యాధుల కన్నా నివారణ మార్గాలే ముఖ్యమైనవని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి ధరావత్ రాజునాయక్,తెనాలి అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి,సబ్ యూనిట్ అధికారులు అందె బాలచంద్రమౌళి, శివగణేష్,చల్లావెంకటేశ్వర్లు,ఏ శ్రీమన్నారాయణ, శ్రీకంఠ ఉమాకాంత్, వంగలపున్నారెడ్డి, ప్రశాంత్ కుమార్, టీ సాంబయ్య బి టంకటప్పయ్య, సుధీర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు

## పారిశ్రామిక అభివృద్ధి... ఉపాధి కల్పనే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్‌ను పరిశీలించారు. అంతకుముందు ఎయిర్‌పోర్టు సమీపంలో టిడిపి ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు ఇండస్ట్రియల్ జోన్‌కు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. కొందరు దుండగులు శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. ఆ తర్వాత ఇండస్ట్రియల్ జోన్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడారు. నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. అనంతరం జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను మంత్రి టి.జి భరత్, ఎమ్మెల్యే చరితారెడ్డికి ఫ్యాక్టరీ యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సీఎం అవ్వడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన పరిశ్రమలు మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో విధ్వంసం తప్ప జరిగిందేమీ లేదన్నారు. తమ టిడిపి ప్రభుత్వం అభివృద్ధే మంత్రంగా ముందుకు వెళుతోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం.. మళ్లీ టిడిపి ప్రభుత్వం రావడంతో ఇప్పుడున్న ఫ్యాక్టరీని మరింత విస్తరించేందుకు ముందుకొస్తోందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం నెమ్మదిగా సాగిందన్నారు. ప్రభుత్వం తరుపున ఫ్యాక్టరీకి అందించాల్సిన విద్యుత్, వాటర్, రైల్వే సైడింగ్స్ ఏదీ గత ప్రభుత్వం చేయలేదన్నారు. పారిశ్రామికవేత్తలందరితో చర్చలు జరుపుతున్నామని.. వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వారందరూ ఆసక్తిగా ఉన్నట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీ నుండి వెళ్లిపోయిన ఓ పరిశ్రమ చెన్నైలో రూ. 3 వేల కోట్లతో ప్లాంటును ఇప్పుడు నడుపుతుందని తెలిపారు. మళ్లీ మన రాష్ట్రానికి రావడానికి వాళ్లు ఆసక్తిగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ లో మౌలిక సదుపాయాల కల్పనకు 1800 కోట్ల రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ గ్రీన్ జోన్‌లో ఉందని, ఓర్వకల్లు రెడ్ జోన్‌లో ఉండటంతో ఎలాంటి పరిశ్రమలైనా ఇక్కడ ఏర్పాటు చేయొచ్చన్నారు. ఇలాంటి చోట మౌలిక సదుపాయాలు బాగా కల్పిస్తే ఓర్వకల్లులో పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకే బెస్ట్ కన్సల్టెన్సీతో మాట్లాడి ఇండస్ట్రియల్ జోన్లో సమస్యలేమైనా ఉంటే గుర్తించి సరిచేసుకుంటామన్నారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తమ ప్రభుత్వం మరో రెండు దశాబ్దాల పాటు కొనసాగుతుందని.. పారిశ్రామిక వేత్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఏపీని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్లో పెట్టుబడులు ఊహించిన దానికంటే ఎక్కువగానే వస్తాయన్నారు. ఇక్కడ నీరు, విద్యుత్, రోడ్డు, రైల్వే లైన్ ఇతర సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు.

అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఇక్కడ అనేక పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఈ గ్రామాలలోని యువతకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ ఎండి కొయాంక, కర్నూల్ ఆర్డీవో శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, ఓర్వకల్లు తహసిల్దార్ వెంకటరమణ, ఇండస్ట్రియల్ ఏఈ సందీప్ పాల్గొన్నారు.

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి

జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్ పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం, షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు

ప్రకటనల విభాగం


76 61 80 59 68

## విరాళం చెక్కును కేరళ సిఎంకు అందించిన చిరు



**తిరువనంతపురం(జర్నలిస్ట్ ఫైల్) :** కేరళలోని వయనాడ్ బాధితులకు మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ కలిసి ప్రకటించిన ఆర్థికసాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ కి అందించారు. ఈ సందర్భంగా చిరంజీవి కేరళ రాజధాని తిరువనంతపురంలో సిఎం పినరయి విజయన్‌తో సమావేశమయ్యారు. తాము విరాళంగా ప్రకటించిన కోటి రూపాయల చెక్కును చిరు కేరళ సీఎంకు అందజేశారు. ఇప్పటికే బాధితులను రక్షించడం, పునరావాసం కోసం పలువురు ప్రముఖులు ఉదారంగా కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాలు ఇస్తున్న సంగతి విదితమే.

# సిక్కింలో భూకంపం



**సిక్కిం (జర్నలిస్ట్ ఫైల్) :** సిక్కింలో భూకంపం సంభవించింది. సిక్కింలో రిచర్ స్కేల్‌పై 4.5 తీవ్రతతో భూకంపం సంభవించిందని అధికారులు తెలిపారు. పశ్చిమ సిక్కింలోని సోరెంగ్ పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వారు తెలిపారు. ఇది ఉదయం 6.57 గంటలకు 10 కి.మీ లోతులో తాకినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ప్రకంపనలు స్వల్పంగా ఉన్నప్పటికీ, మరొక భూకంపం సంభవిస్తుందని చాలా మంది ప్రజలు తమ నివాసాల వెలుపల గుమిగూడారు. 2011 సెప్టెంబరు 18న సిక్కింలో 6.9 తీవ్రతతో సంభవించిన భూకంపం వలన 100 మందికి పైగా మరణించారు.

## రోడ్లు, ఆసుపత్రుల్లాగే.. కోర్టు భవనాలు నిర్మించడం ప్రభుత్వ విధి




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** రహదారులు, ఆసుపత్రుల మాదిరిగానే కోర్టు భవనాలు నిర్మించాల్సిన బాధ్యతకూడా ప్రభుత్వాలదేనని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు గతంలో ప్రభుత్వాలు న్యాయ వ్యవస్థను అనుత్పాదక విభాగంగా పరిగణిస్తే, నిరంతర నిఘాతో అనవసరమైన అడ్డంకులు సృష్టించే వ్యవస్థగా బ్యూరోక్రసీ భావించిందని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారమిక్కడ ఆయన స్వదేశీ కాంక్లేవ్‌లో ప్రసంగించారు. న్యాయస్థానాల్లో దాఖలవుతున్న కేసుల సంఖ్య పెరగడానికి, న్యాయం అందించడంలో జాప్యానికి ప్రధాన కారణం జనాభా, పారిశ్రామికీకరణ, అక్షరాస్యత, వలసలు, అవగాహన పెరిగిపోవడమేనన్నారు. కొత్త చట్టాలు కూడా వివాదాలు పెరగడానికి దోహదం చేస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. అయితే శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు మాత్రం న్యాయవ్యవస్థపై పెరిగిపోతున్న భారాన్ని తగ్గించడానికి సహకరించడంలేదని జస్టిస్ రమణ విమర్శించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనం కోసం న్యాయవ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం అన్ని స్థాయిల్లో ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీచేయాలని, న్యాయాధికారులు, న్యాయమూర్తుల పోస్టుల సంఖ్య పెంచాలని సూచించారు. న్యాయ నిర్ణయాధికార ప్రక్రియలోకి విభిన్న సామాజిక, రాజకీయ నేపథ్యం ఉన్నవారికి భాగస్వామ్యం కల్పించాలన్న ప్రతిపాదనను తాను సంపూర్ణంగా బలపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మౌలికవసతుల సమస్యను అధిగమించేందుకు న్యాయవ్యవస్థకు స్వతంత్ర వనరులు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం నేషనల్ జ్యుడీషియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటీ పేరుతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేయాలని తాను ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. తన హయాంలో వీడియో కాన్ఫరెన్స్, ప్రత్యక్ష ప్రసారాలు, ఈ-కోర్ట్ వ్యవస్థను బలోపేతం చేయడం సంతోషం కలిగించిందని జస్టిస్ రమణ చెప్పారు.

# వయనాడ్‌కు ప్రధాని మోడీ




**తిరువనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** కేరళ వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందలాది మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వయనాడ్‌లో రేపు (ఆగస్టు 10వ తేదీ) ప్రధాని మోడీ పర్యటించనున్నారని కేరళ సిఎం పినరరు విజయన్ చెప్పారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ప్రధాని పర్యటిస్తారని, బాధితులకు పునరావాసం కల్పించే విషయంలో ఆయన సానుకూలంగా స్పందించారని సిఎం విజయన్ చెప్పారు. తమ వినతి మేరకు 9 మంది నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హెూంశాఖ అంగీకరించిందన్నారు. ఈ నిపుణుల కమిటీ విపత్తు తీవ్రతను అంచనా వేసి నివేదిక ఇస్తుందన్నారు. ఈ దర్ఘటనలో 131 మంది వం-కు గల్లంతైనట్లు గుర్తించామన్నారు. వీరి కోసం గాలింపు కొనసాగుతుందని చెప్పారు. వయనాడ్ విషాదం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ వినిపిస్తున్న వేళ మోడీ పర్యటనకు రావడం గమనార్హం.

# కాంగోలో మంకీపాక్స్ వ్యాప్తి

**● అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ**




**కిన్షాసా (జర్నలిస్ట్ ఫైల్) :** డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మంకీపాక్స్ వ్యాధి గత సెప్టెంబర్ నుంచి వేగంగా విస్తరిస్తోంది. అనియంత్రిత వ్యాప్తి కారణంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. గత సెప్టెంబర్ నుంచి దేశంలో ఈ వ్యాధి వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే 27,000 మందికి సోకినట్లు నిర్ధారించారు. 1100 మంది మృతి చెందగా, వీరిలో చిన్నారులు అత్యధికంగా ఉన్నారని తెలిపారు. ఈ ప్రాంతంలోని బురుండి, కెన్యా, రువాండా, ఉగాండా దేశాలకు వ్యాధి వ్యాపించడంతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ తెలిపారు. ఈ పరిస్థితి అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తుందో లేదో ఈ సమావేశంలో అంచనా వేయనున్నారు. అయితే అవసరమైన హెచ్చరికలు జారీ చేయబడతాయి. ఈ ఏడాది ఆఫ్రికాలోని పది దేశాల్లో మంకీపాక్స్ నిర్ధారణ అయింది.

# మనీష్ సిసోడియాకు బెయిల్




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** లిక్కర్‌పాలసీకి సంబంధించి ఇడి, సిబిఐ కేసుల్లో ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాకు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. సిసోడియా 17 నెలల సుదీర్ఘ జైలు శిక్ష మరియు విచారణ ప్రారంభంలో ఎదుర్కొంటున్న జాప్యాన్ని పేర్కొంటూ.. సత్వర సిసోడియాకు ఉన్న హక్కును విచారణకు జస్టిస్ బి.ఆర్.గవై మరియు కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. రూ.10 లక్షల పూచీకత్తుతో బెయిల్ జారీ చేసింది. సిసోడియాకు కొన్ని షరతులు విధించింది. పాస్‌పోర్ట్ సరెండర్ జారీ చేయాలని, ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలని, సాక్ష్యాలను తారు మారు చేయడం లేదా సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్‌పై విడుదలైన కేజ్రీవాల్ మాదిరిగా, సిసోడియా ఢిల్లీ సెక్రటేరియట్ లేదా ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లకుండా నియంత్రించాలన్న ఇడి మౌఖిక అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. అవినీతి నిరోధక చట్టం కింద సిసోడియాను గతేడాది ఫిబ్రవరి 26న సిబిఐ అరెస్ట్ చేయగా, అదే ఏడాది మార్చి 9న మనీలాండరింగ్ నిరోధక చట్టం (ఎంపిఎల్ఎ) కింద ఇడి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. సిసోడియా బెయిల్ దరఖాస్తును మే 30న ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ కూడా జూన్ 4న సిసోడియాకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది.

## నీట్ పీజీ ఎగ్జామ్‌ను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్ట్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఈఆదివారం జరగాల్సిన నీట్ పీజీ ఎగ్జామ్‌ను (NEET PG Exam) వాయిదా వేయాలంటూ కొంతమంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్ట్ కొట్టివేసింది. పరీక్షను వాయిదా వేయడానికి నిరాకరించింది. దాదాపు 2 లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్‌ను ప్రమాదంలో పడేయలేమని వ్యాఖ్యానించింది. కాగా నీట్-యూజీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా జూన్ 23న పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల ప్రవేశ పరీక్షను వాయిదా వేశారు. కాగా నగరాల్లో తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం కష్టమని పేర్కొంటూ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎగ్జామ్ కేంద్రాలకు చేరుకోవడం చాలా మంది విద్యార్థులకు చాలా కష్టంగా ఉందని పేర్కొన్నారు. ఏ నగరంలో పరీక్ష కేంద్రం ఉంటుందనేది జులై 31న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) అధికారులు తెలిపారని పేర్కొన్నారు. ఇక ఆదివారం నిర్వహించాల్సిన పరీక్షా కేంద్రం సమాచారాన్ని వెల్లడించారని విద్యార్థుల తరపు న్యాయవాది వాదించారు. రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారని, అయితే 'స్కోర్స్ నార్మలైజేషన్ ఫార్ములా'ను ఇంకా వెల్లడించలేదని పేర్కొన్నారు. వాదనలు విన్న సుప్రీంకోర్ట్ పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జడ్జిలు మనోజ్ మిశ్రా, జేబీ పార్దివాలాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పరీక్షకు కేవలం 2 రోజుల ముందు వాయిదా వేయాలని ఆదేశించలేమని తేల్చిచెప్పింది.

## జాతీయం/అంతర్జాతీయం

## లిక్కర్ కేసు - కవిత వర్చువల్ హాజరు




**న్యూ ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** లిక్కర్‌స్కామ్ కేసుకు సంబంధించి సిబిఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ పై ఢిల్లీ కోర్టులో చేపట్టిన విచారణకు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సహా లిక్కర్ కేసు నిందితులంతా వర్చువల్‌లో హాజరయ్యారు. సిబిఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో పేజినేషన్ సరిగ్గా లేదని నిందితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నెల 14 లోపు ఛార్జ్‌షీట్‌లో సరిగ్గా పేజినేషన్ చేస్తామని సిబిఐ కోర్టుకు తెలిపింది. అనంతరం ఈ కేసును ఆగస్టు 21 కి వాయిదా వేసినట్లు న్యాయమూర్తి కావేరి బవేజా వెల్లడించారు.

## నాలుగు మృతదేహాల గుర్తింపు



**తిరువనంతపురం (జర్నలిస్టు ఫైల్) :** వయనాడ్ ఘటనకు సంబంధించి కేరళ అటవీశాఖ గాలింపు మరియు సహాయక బృందం శుక్రవారం నాలుగు మృతదేహాలను వెలికితీసింది. ఒక మృతదేహం పూర్తిగా ఛిద్రమైనట్లు అధికారులు తెలిపారు. వయనాడ్ జిల్లాలోని కొండచరియలు విరిగిపడిన ప్రాంతం నుండి కొంతదూరంలో సూచిపర జలపాతం దిగువన గుర్తించారని అన్నారు. భారత వైమానిక దళం (ఐఎఫ్) హెలికాప్టర్ ఆ మృతదేహాలను సుల్తాన్ బతేరిలోని మార్చురీకి చేర్చిందని చెప్పారు.
సూచిపర జలపాతాల దిగువన ఉన్న కాంతన్‌పర సమీపంలోని రాళ్లపై సహాయక బృందం మృతదేహాలను గుర్తించినట్లు ప్రాథమిక సమాచారం అందినట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. కొండచరియలు విరిగిపడిన చూరల్ మల, ముండక్కై, అట్టమల ప్రాంతాల నుండి దిగువకు కొట్టుకుపోయిన వారిలో ఎక్కువమంది జలపాంతం అంచుల్లోని పొదలు, చెట్లు, బండరాళ్ల మధ్యలో చిక్కుకుపోయి వుండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. సన్‌రైజ్ వ్యాలీతో పాటు సూచిపర జలపాతం ఇరువైపులా, మలప్పురం జిల్లాలోని చలియార్ నది వరకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

## పంద్రాగస్టు ముందు భారీ ఉగ్ర కుట్ర భగ్నం.. ఆయుధాలతో చిక్కిన వాంటెడ్ ఉగ్రవాది

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర్య వేడుకల ముందు దేశ రాజధానిలో భారీ ఉగ్ర కుట్రను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. పరారీలో ఉన్న ఓ ఐసిస్ వాంటెడ్ ఉగ్రవాది ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. అతడి నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగం అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఢిల్లీలోని దర్యాగంజ్ నివాసి అయిన రిజ్వాన్ అబ్దుల్ హాజీ అలీ ఐసిస్ పుణె మాడ్యూల్‌లో కీలక సభ్యుడిగా వ్యవహరిస్తున్నాడు. అతడిపై ఇప్పటికే జాతీయ దర్యాప్తు సంస్థ రూ.3లక్షల రివార్డ్ కూడా ప్రకటించింది. గురువారం రాత్రి 11 గంటలకు తుగ్లకాబాద్‌లోని బయోడైవర్సిటీ పార్క్ వద్దకు రిజ్వాన్ అలీ వస్తాడని పోలీసులకు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన ప్రత్యేక విభాగం పోలీసులు అత్యంత చాకచక్యంగా అతడిని ట్రాప్ చేసి పట్టుకున్నారు. అలీ నుంచి పిస్టోల్, ఇతర ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రెండు మొబైల్ ఫోన్లను సీజ్‌చేసి.. వాటిల్లోని డేటాను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. స్వాతంత్ర్య వేడుకల వేళ దేశ రాజధానికి అతడు రావడం కలకలం రేపింది. ఇప్పటికే ఢిల్లీలోని పలు వీఐపీ ప్రాంతాల్లో రిజ్వాన్, అతడి అనుచరులు పలుమార్లు రెక్కీ చేసినట్లు పోలీసువర్గాలు వెల్లడించాయి. పంద్రాగస్టు వేళ వీరు ఉగ్రదాడులకు కుట్రలు పన్నినట్లు అనుమానిస్తున్నారు. ఈ అరెస్టు నేపథ్యంలో ఢిల్లీవ్యాప్తంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## తల్లి నగలు విక్రయించి.. ప్రియురాలికి ఐఫోన్

**ఇంటర్నెట్ డెస్క్:** ప్రియురాలికి బహుమతి కొనివ్వాలనుకున్న బాలుడు అందుకోసం ఏకంగా తల్లి నగలనే అమ్మేశాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఘటన చోటుచేసుకుంది. తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తన ప్రియురాలి పుట్టినరోజు సందర్భంగా ఐఫోన్ బహుమతిగా ఇవ్వాలని భావించాడు. అందుకోసం తల్లిని డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఇంట్లోని బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లి అమ్మేశాడు. ఇంట్లోని రెండు బంగారు గొలుసులు, చెవి కమ్మలు, ఉంగరం కనిపించకుండా పోవడంతో.. బాలుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని అందులో పేర్కొన్నారు. బాలుడి స్నేహితులను పోలీసులు ప్రశ్నించగా.. ఫిర్యాదు చేసిన మహిళ కుమారుడు ఇటీవలే రూ.50వేలు ఖర్చు చేసి ఐఫోన్ కొని ప్రియురాలికి పుట్టిన రోజు బహుమతిగా ఇచ్చినట్లు వెల్లడైంది. అనంతరం బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు

## ఇజ్రాయెల్‌కు ఎయిర్‌ఇండియా విమాన సర్వీసులు బంద్..



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం మధ్యలో హెజ్‌బొల్లా, ఇరాన్ జోక్యంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల వేళ భారత విమానయాన సంస్థ ఎయిర్‌ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.
తదుపరి నోటీసులిచ్చేంతవరకు టెల్‌అవీవ్ నుంచి రాకపోకలు సాగించే విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఎయిర్‌ఇండియా ప్రకటించింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి సర్వీసుల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు పూర్తి రీఫండ్ ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. అంతకుముందు ఆగస్టు 2 నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీ-టెల్ అవీవ్ మధ్య విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ఎయిర్‌ఇండియా ప్రకటించిన సంగతి తెలిసిందే.
ఢిల్లీ- టెల్ అవీవ్ మధ్య వారానికి నాలుగు సర్వీసులను ఎయిర్‌ఇండియా నడుపుతోంది. అయితే, గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిపిన తర్వాత ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో దాదాపు ఐదు నెలల పాటు టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులను ఈ ఎయిర్‌లైన్ నిలిపివేసింది.
ఆ తర్వాత పరిస్థితులు కాస్త సద్దుమణిగాక మళ్లీ సర్వీసులను పునరుద్ధరించింది.
హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియా ఇటీవల ఇరాన్‌లో హత్యకు గురైన సంగతి తెలిసిందే. మరోవైపు హమాస్ సైనిక విభాగాధిపతి మహమ్మద్ డెయిఫ్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇక, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సీనియర్ మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్ ఇజ్రాయెల్ జరిపిన దాడిలో మృతిచెందాడు. ఈ వరుస పరిణామాలతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే ఇజ్రాయెల్ భూభాగం దిశగా లెబనాన్ పలు రాకెట్లను ప్రయోగించింది.

# జేపీసీ పరిశీలనకు వక్ఫ్ బిల్లు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు తెచ్చే దిశగా రూపొందించిన సవరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం ఒక్క అడుగు వెనక్కు వేసింది. గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై విపక్షాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపించనున్నట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. జేపీసీ ఏర్పాటుపై సభలోని అన్ని పార్టీల నేతలతో మాట్లాడనున్నట్లు స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన వెంటనే విపక్ష ఇండియా కూటమి ఎంపీలు తీవ్ర నిరసనకు దిగారు. ఈ బిల్లును రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. బిల్లును వ్యతిరేకిస్తూ నోటీసు ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఎంపీ కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ..మతస్వేచ్ఛ హక్కును కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ధ్వజమెత్తారు. ఇది క్రూరమైన చట్టమని, త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దీనిని తీసుకొస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, మతపరమైన విభజనకు దారితీస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్‌తో పాటు టీఎంసీ, ఎంఐఎం, సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ(శరద్‌పవార్) ఎంపీలు బిల్లుపై భగ్గుమన్నారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లింయేతరులను చేర్చేలా నిబంధనను మార్చాల్సిన అవసరం ఏమిటని సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్ నిలదీశారు. వక్ఫ్ చట్టానికి సవరణలు తీసుకొచ్చే అధికార పరిధి లోక్‌సభకు లేదని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన జేడీ(యూ), తెదేపా, శివసేన(శిందే), లోక్‌జనశక్తి పార్టీలు వక్ఫ్ సవరణ బిల్లును సమర్థించాయి.

**మతస్వేచ్ఛకు ఆటంకం ఉండదు-కిరణ్ రిజిజు**

విపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా తోసిపుచ్చారు. 'వక్ఫ్ సవరణ బిల్లు వల్ల మతపరమైన స్వేచ్ఛకు ఎటువంటి ఆటంకం ఉండదు. ఇతరుల హక్కులను హరిస్తుందనే ప్రశ్నే తలెత్తదు. ఇప్పటి వరకు హక్కులు పొందని ముస్లింలకు ఈ బిల్లు ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. వక్ఫ్ బోర్డులు మాఫియాలుగా మారాయని పలువురు విపక్ష నేతలు నాతో స్వయంగా అన్నారు. రాజకీయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి కనుక వారి పేర్లను వెల్లడించను' అని కేంద్రమంత్రి రిజిజు వివరించారు. వక్ఫ్ చట్టం-1995లోని కొన్ని నిబంధనలు రాజ్యాంగపరిధిని మించి ఉన్నాయని, ఆ చట్టంలోని లోపాలను సరిచేస్తున్నామని తెలిపారు. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసే విధంగా వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ మేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చేయాలని ప్రతిపాదించింది. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

**పార్లమెంటులో ముగిసిన బడ్జెట్ కసరత్తు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సర(2024-25) కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి పార్లమెంటు ఆమోదాల ప్రక్రియ గురువారంతో పూర్తయ్యింది. వివిధ పద్దులపై రాజ్యసభలో జరిగిన చర్చకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమగ్రమైన వివరణ ఇవ్వడం, ఆ తర్వాత ఎగువ సభ వినిమయ, ద్రవ్య బిల్లులను లోక్‌సభకు పంపించడంతో బడ్జెట్ కసరత్తు ముగిసినట్లయ్యింది. ఈ బిల్లులను ఇప్పటికే లోక్‌సభ ఆమోదించిన విషయం తెలిసిందే.

# మధుర మీనాక్షి అమ్మవారి ఆలయంలో శ్రీఆదిశంకరులు శ్రీచక్రం ప్రతిష్ఠించిన ఉదంతం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అష్టాదశశక్తి పీఠములలో మధుర మీనాక్షి ఆలయ పీఠము ప్రముఖమైనది. మీనముల వంటి చక్కని విశాలనేత్రములతో ఒకే ఒక మరకత శిలతో అమ్మవారి విగ్రహము చెక్కబడినది. ఆకుపచ్చ, నీలము కలగలిపిన మరకత మణి శరీరకాంతి ఆతల్లి ప్రత్యేకత. మధురను పరిపాలించే ఆపాండ్య రాజులంతా ఆతల్లిని ఆడపడుచుగా, కులదేవతగా, జగజ్జననిగా ఆరాధిస్తారు. దేవీ భాగవత పురాణములో మణిద్వీపవర్ణనలా ఆఆలయాన్ని పాండ్య రాజులు రూపొందించారు. అంతటి సౌందర్యరాశి, చతుష్షష్టి కళానిలయమైన మీనాక్షి గూడా రాత్రివేళ తామస శక్తిస్వరూపిణిగా మారి ప్రాణిహింసకు పాల్పడుతున్నది. ఆమెను శాంతింపచేయడానికి యావద్భారతములోని మూలమూలల నుండి వేదపండితులను, ఋత్విక్కులను పిలిపించి యజ్ఞాలు, యాగాలు, క్రతువులు పూజలు, జపహోమాలు అన్నీ చేయించారు. వారు పూజలు చేస్తుండగా వారినీ కబళించి వేసినది మీనాక్షి.



సాక్షి

పాండ్యరాజు నిస్సహాయంగా ఉండిపోయి తమ రాచరికపు కర్తవ్యంగా రాత్రి వేళ నగరంలో నర సంచారం లేకుండా నిషేధాజ్ఞలు విధించారు. సంధ్యా సమయానికల్లా ప్రజలంతా తమ తమ పనులన్నీ పూర్తి చేసుకుని రాత్రి ప్రారంభం కాగానే ఎవరి గృహాల్లో వారు బందీలుగా మారిపోయారు. ఆపద వచ్చినా, అపాయం వచ్చినా వారికిక బయటకి వచ్చే వీలు లేదు. వచ్చారో నగర సంచారానికి బయలుదేరిన అమ్మవారి కోపాగ్నికి ఆహుతై పోవలసిందే. క్షేత్ర పాలకుడూ, మీనాక్షీ హృదయేశ్వరుడూ అయిన సుందరేశ్వరుడు కూడా ఈ జరుగుతున్నదంతా భూతునిలా చూస్తూ ఉండిపోయాడు. తన దేవేరి తామస ప్రవృత్తిని మాన్పించటానికి తన అంశతో ఒక అవతార పురుషుడు జన్మించాలి. మౌనం వహించి తీరాల్సిందే తప్ప మరేమీ చేయటానికి లేదని నిర్ణయించు కున్నాడా భోళా శంకరుడు. తన శరీరంలోని అర్ధభాగము అయిన ఈశ్వరుని అవమానపరిస్తే , తనను తాను అవమానపరచుకోవడమే అవుతుంది. బాహ్యలోకానికి ఆమెను చులకన చేసినట్లవుతుంది. ఎలా? కాలము విచిత్రమైనది. ఏ సమయములో, ఏ ప్రాణికి, ఏ శిక్ష, ఏ పరీక్ష, ఏ దీక్ష, ఏ సమీక్ష ప్రసాదించాలో ఒక్కమహాకాలుడికే తెలుసు. ఎవరి వంతుకు ఏది వస్తే అది వారు మంచి అయినా, చెడు అయినా, జయమైనా, పరాజయమైనా అనుభవించి తీరాల్సిందే.

ఆది శంకరాచార్యులు మధురలో అడుగుపెట్టే నాటికి పరిస్థితి పైవిధముగా ఉన్నది. పాండ్యరాజు ఆదిశంకరులను అత్యంత భక్తి శ్రద్ధలతో స్వాగతము పలికి తన అంతఃపురంలో సకల సేవలు చేసాడు. అద్భుత తేజస్సుతో వెలిగిపోతున్న యువబ్రహ్మచారి అయిన ఆదిశంకరాచార్యులు" నేను మధుర మీనాక్షి ఆలయం లో ఈ రాత్రికి ధ్యానము చేసుకుంటాను అని చెప్పాడు". ఆ మాటలను విన్న పాండ్య రాజు పాదాల కింద భూకంపము వచ్చినంతగా కంపించిపోయాడు."వద్దు స్వామి మేము చేసుకున్న ఏ పాపమో, ఏ శాప ఫలితమో చల్లని తల్లి కరుణారస సౌందర్యలహరి అయిన మా మీనాక్షి తల్లి రాత్రి సమయములో తామస శక్తిగా మారి కంటికి కనిపించిన ప్రాణినల్ల బలితీసుకుంటున్నది. అందుచేత అంతఃపురంలోనే మీ ధ్యానానికి ఏ భంగము రాని విధముగా సకల ఏర్పాట్లు చేయిస్తాను. మీరు ఆలయములోకి రాత్రి వేళ అడుగుపెట్టవద్దు .అసలు అంతః పురం నుండి బయటకు ఎవరూ వెళ్ళరు. పొరపాటుగా బయటకు వస్తే వారు మరునాటికి లేనట్టే లెక్క అని వివరించి పాండ్య రాజు వేడుకున్నాడు. ఆది శంకరాచార్యులు పాండ్యరాజును శతవిధాల సమాధాన పరచాడు. 'సన్యాసులకు గృహస్తుల భిక్ష స్వీకరించే వరకే ఉండాలి కాని తర్వాత వారు గృహస్తుల గృహాలలో ఉండరాదు. మేము ఆలయములోనే ఉంటాము. జగన్మాత అయిన మీనాక్షి అమ్మవారిని మనసారా ధ్యానము చేసుకుంటే తప్ప నాకు సంతృప్తి కలగదు. మీరు అడ్డు చెప్పవద్దు' అన్నాడు. పాండ్యరాజు హతాశుడైనాడు.

దైవీ తేజస్సుతో వెలిగిపోతున్న ఈ యువబ్రహ్మచారినిక చూడనేమో అని పాండ్యరాజు ఆవేదన చెందాడు. ఆదిశంకరాచార్యను ఆలయము లోనికి తీసుకొనివెళ్లి తిరిగి అంత:పురానికి వెళ్ళాడు. పాండ్యరాజుకు ఆరాత్రి నిద్ర లేదు. ఈ యువసన్యాసిని అమ్మవారు బలితీసుకుంటుదేమో ఆ పాపము తన తరతరాలను పట్టి పీడిస్తుందేమో అని నిద్రరాక అటు ఇటూ పచార్లు చేయసాగాడు. రాత్రి అయినది. గర్భగుడికి ఎదురుగా ఉన్న విశాలమైన మండపములో పద్మాసనము వేసుకొని ఆదిశంకరాచార్య ధ్యానములో కూర్చుండి పోయాడు. మరకతశ్యామ అయిన ఆ తల్లి ఆయన మనో నేత్రాలముందు ప్రత్యక్షమై భ్రుకుటి మధ్య నిలచి సహస్రారములో ఆశీనురాలై చంద్రకాంతి వంటి వెలుగులతో సుధా వర్షము కురిపిస్తున్నది. ఆసమయము లోనే ఆలయములోని గంటలన్నీ వాటంతట అవే మ్రోగనారంభించాయి.

ఆలయములోని అన్నివైపులా దీపారాధనలోని వెలుగులు దేదీప్యమానంగా వెలగసాగాయి. గర్భగుడిలో మరకతశిల అర్చామూర్తిలో చైతన్యము వచ్చి అమ్మవారు మెల్లగా పీఠము నుండి లేచి నిల్చున్నది. పాద మంజీరాలు ఘల్లుమన్నాయి.

## నీరజ్ చోప్రాకు ఏపి సిఎం చంద్రబాబు అభినందనలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పారిస్ ఒలింపిక్స్ లో రజత పతకాన్ని గెలుచుకున్న నీరజ్ చోప్రాకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలుపుతూ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. దేశం మరోసారి గర్వించేలా ఉత్తమ ప్రదర్శన ఇచ్చారని కొనియాడారు. క్రీడల పట్ల నీరజ్ చోప్రాకు ఉన్న ఆసక్తి ప్రపంచ యువతకు స్ఫూర్తి అని ప్రశంసించారు. ఆయన మరెన్నో విజయాలు అందుకుంటారని విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

## బుద్ధదేవ్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు



**రాజంపేట అర్బన్(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్ పేర్కొన్నారు. రాజంపేట పట్టణంలో మునిసిపల్ కార్మికులతో కలిసి బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 11 ఏళ్ల పాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా సిపిఎం నుంచి బుద్ధదేవ్ పనిచేశారని, బెంగాల్లో 34 వేలు సిపిఎం తో పాటు వామపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని ఎలాయని తెలిపారు. బుద్ధదేవ్ జీవితం ఆదర్శప్రాయమని, పశ్చిమ బెంగాల్ కు నిస్వార్ధ సేవలు అందించారని తెలిపారు. ఆయన మృతి సిపిఎంకి తీరని లోటు అని, ఆయనకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు రమణ, ప్రసాద్, లక్ష్మీదేవి, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇష్ట కామేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సీతారామపురం మండలంలోని ప్రాచీనశైవక్షేత్రమైన ఘటిక సిద్దేశ్వరంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇష్టకామేశ్వరిదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో నెల్లూరు జిల్లా వాసులతోపాటు ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల నుంచి భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని రెండు అన్నదాన సత్రాల్లో భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

## అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**అంతర్వేది (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఈ ఏవిధమైన రుసుము వసూలు చేయకుండా ఉచితంగా పూజలు చేశారు. అంతకుముందు ద్రవ్య సామగ్రిని దేవస్థానం ఉచితంగా అందజేసింది. అనంతరం పండితులు మహిళా భక్తులకు వేదాశీర్వచనం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. శ్రావణ మాసంలో ప్రతి శుక్రవారం ఈ పూజలు ఉంటాయని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

## గిరిజన నృత్యంలో పాలకొండ ఎమ్మెల్యే



**మన్యం (జర్నలిస్ట్ ఫైల్) :** సీతంపేట ఐటీడీఏ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన నృత్యంలో పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పిఓ రాహుల్ కుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విఆర్ పురంలో ఆదివాసి దినోత్సవం



**విఆర్ పురం (జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రేఖపల్లి కస్తూర్బాయ్ హాస్టల్ యందు, రేఖపల్లి సెంటర్లో వివిధ గ్రామాల్లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి, ఉపాధ్యాయులు సోడి నాగేశ్వరరావు, గిరిజన సంఘ మండల కార్యదర్శి పూనం ప్రదీప్ కుమార్, ఇతర నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను గిరిజనులకు 100% ఉద్యోగాలు రావాలన్నా జీవో నెంబర్ 3 పటిష్టంగా అమలు చేయాలి. పోలవరం ప్రాజెక్టు వలన ఎక్కువ శాతం ఆదివాసి గిరిజనులు ముంపునకు నష్టపోతున్నారు. పరిధిలో గ్రామాలకు ఇంకా సగం మందికి ప్యాకేజీ ఇవ్వాలని ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని వాళ్లకి కూడా పునర్వాస కాలనీలో ఉపాధి కల్పించాలని వారికి కూడా స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం. ఆదివాసి గిరిజన సంఘం 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. దీనితో పాటు పోడు భూమి పట్టాలు 20 సంవత్సరాల పైబడి ఇంతవరకు గిరిజనులకు పట్టాలు హక్కు పత్రాలు ఇవ్వలేదు. పోడి భూములకు పట్టాలు ఇవ్వకపోగా వ్యవసాయం చెయ్యనీయ కుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. ఇకనైనా గిరిజనలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ప్రపంచ ఆదివాసి దినోత్సవం 15 షెడ్యూల్ ఉన్న ఆదివాసి చట్టాలను పటిష్టంగా అమలు చేసిన రోజునే ఆదివాసులు న్యాయం జరుగుతుందని గిరిజన సంఘం మండల కమిటీ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న గిరిజన సంఘం మండల నాయకులు ప్రజాప్రతినిధులు కారం. సుందరయ్య. తదితరులు పాల్గొన్నారు.

## ఒలింపిక్స్ హాకీలో రజతంపై క్రీడా సంఘాల హర్షం



**కర్నూలు జిల్లాపరిషత్ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్యారిస్లో జరుగుతున్న ఒలంపిక్స్ లో భారత హాకీ జట్టు రజత పతకం సాధించడం పై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, హాకీ అసోసియేషన్ లు జయ ధ్వానాలు చేస్తూ మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలోని ధ్యాన్ చంద్ కాంస్య విగ్రహం ముందు వారు ఈ సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ సంఘం కార్యదర్శి షేక్షావలి, పవర్ లిఫ్టింగ్ సంఘం వ్యవస్థాపకులు వేణుగోపాల్, నాయకులు కొండపోగు చిన్న సుంకన్న, టైక్వాండో ప్రతినిధి వెంకటేశ్వర్లు, హాకీ ప్రవీణ్ వీరేష్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనంపై దాడి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ నడిబొడ్డున నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్మృతి వనంపై దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ స్మృతి వనం వద్ద ఏర్పాటు చేసిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి పేరును ధ్వంసం చేశారు. అంబేద్కర్ మహాశిల్పం చుట్టుపక్కల విద్యుత్ సరఫరా నిలిపివేయించి, సిబ్బందిని బయటకు తరలించి ఈ దాడులు చేశారని సమాచారం.

తెలుగుదేశం మూకలు కుట్రపూరితంగా ఈ దాడికి పాల్పడ్డారని వైసిపి శ్రేణులు ఆరోపిస్తున్నారు. అక్కడ పనిచేసే కొందరి సిబ్బంది ఫోన్లను లాకున్నారని, మరికొందరిని ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోమని బెదిరించారని సమాచారం.

ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగిందని వారు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అలనాటి రామచంద్రుడు' పాట వస్తుండగా.. థియేటర్లోనే ప్రేమజంట పెళ్లి..!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రిన్స్ మహేష్ బాబు పుట్టిన రోజు వేళ నేడు మురారి, ఒక్కడు సినిమాలను వరల్డ్ వైడ్‌గా రీరిలీజ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని థియేటర్లలో మహేష్ అభిమానుల సందడి నెలకొంది. అయితే మురారి సినిమా ప్రదర్శిస్తున్న సమయంలో ఓ వినూత్న ఘటన జరిగింది. ప్రత్యేకంగా మురారిలోని పాటలు అన్నీ సూపర్ హిట్. మరి ముఖ్యంగా అలనాటి రామచంద్రుడు' పాట ఎంతో ఫేమస్. ఎక్కడ పెళ్లి జరిగినా ఈ పాట తప్పనిసరిగా ప్లే అవుతుంది. కాగా మురారి రీరిలీజ్ అయిన ఓ థియేటర్ లో ఓప్రేమ జంట అలనాటి రామచంద్రుడు పాటలో సోనాలి, మహేష్ మాదిరి పెళ్లి చేసుకున్నారు. ఇహ ఆ థియేటర్ అంతా సందడి చేసింది. ఆ ప్రేమ జంట పెళ్లిని ఫ్యాన్స్ కెమెరాలో షూట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ గా మారింది. అలాగే కొన్ని థియేటర్స్ లో అక్షింతలు కూడా చల్లుకుంటూ, స్వీట్లు పంచిపెడుతూ, డ్యాన్సులు వేస్తూ ఫ్యాన్స్ సందడి చేస్తున్నారు.

## అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వర్ణ తాపడంతో ధ్వజస్తంభం



**అన్నవరం(జర్నలిస్ట్ ఫైల్) :** కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వర్ణ తాపడంతో చేసిన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. అనివెట్టి మండపంలో ధ్వజస్తంభానికి బంగారు తాపడంతో తయారు చేసిన కవచాన్ని అమర్చారు. నెల్లూరుకు చెందిన దాత సహకారంతో రూ.2 కోట్లు ఖర్చుతో దీన్ని ఏర్పాటు చేశారు.

గుంటూరు జిల్లా నిడుబ్రోలు నుంచి తీసుకువచ్చిన నారేప కర్రతో సుమారు 60 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. దీనికి సుమారు 300 కిలోల రాగిని వినియోగించడంతో పాటు.. దానిపై 1,800 గ్రాముల బంగారు తాపడం చేశారు. స్తంభానికి అమర్చిన స్వర్ణ రేకుపై అష్ట లక్ష్ములు, దశావతారాలు, పంచాయతనాలు తీర్చిదిద్దారు. వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ అనంతరం ధ్వజస్తంభ ప్రదక్షిణకు భక్తులను అనుమతించారు.

## విజయవాడ అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి నేతల నిరసన



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ అంబేద్కర్ విగ్రహం దగ్గర నల్ల బ్యాడ్జీలు ధరించి వైసిపి నేతలు నిరసన చేపట్టారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ నిరసన తెలిపారు. కాంస్య విగ్రహం ఆవిష్కరణ శిలాఫలకంపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరును గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొగలించటంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ %ా% అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్రంలో రక్షణ లేదని ఆరోపించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఇక్కడ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పాలకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని భక్షించాలనే ఉద్దేశంతో ఉన్నట్టు రాత్రి ఘటన స్పష్టంగా కనిపిస్తుంది.. ఇప్పటికే గ్రామ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన చేయాలని వైసిపి తరపున పిలుపు ఇచ్చామన్నారు. ఈ విషయంపై లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశామని మాజీ మంత్రి మేరుగ నాగార్జున వెల్లడించారు.

## వ్యవసాయ రంగంలో కార్పొరేట్ కంపెనీలను నిరోధించాలి



**కదిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయ రంగంలో కార్పొరేట్ కంపెనీలు జోక్యాన్ని వ్యతిరేకిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని దేశ వ్యాప్త క్విట్ కార్పొరేట్ లో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాలు ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ మురళీకృష్ణకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు, ముస్టాక్, జగన్మోహన్, రామోహన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాం(గెస్‌లో 'పెద్దల' పోటాపోటీ

● రాజ్యసభ సీటు కోసం సీనియర్ నేతల యత్నాలు ● ఆశావహుల్లో జానారెడ్డి, నిరంజన్, అజారుద్దీన్, విహెచ్
● సీనియర్ న్యాయవాది, మాజీ ఎంపి అభిషేక్ మను సింఘ్వి వైపు ఏఐసిసి మొగ్గు

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్: రాజ్యసభ సీటు కోసం తెలంగాణ నుంచి కాం(గెస్ నాయకులు భారీగా పోటీ పడుతున్నారు. బిఆర్ఎస్ తరఫున గెలిచిన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.కేశవరావు గత నెల 31వ తేదీన తన పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఈ ఖాళీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. దేశం మొత్తం మీద 9 రాష్ట్రాల్లోని 12 ఖాళీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేయగా తెలంగాణలోని ఒక స్థానానికి సెప్టెంబర్ 3వ తేదీన పోలింగ్ జరుగనుంది. అయితే ఈ సీటును తమకంటే తమకు కేటాయించాలని పలువురు ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు డిమాండ్ చేస్తుండడం విశేషం. ఇప్పటికే పలువురు కాం(గెస్ నాయకులు అధిష్టానానికి తమ వినతులను ఇస్తున్నట్టుగా సమాచారం. (ప్రస్తుతం ఆ ఒక్క సీటును ఆశిస్తున్న వారిలో కాం(గెస్ సీనియర్ నాయకుడు జానారెడ్డి, వి.హనుమంతరావు, నిరంజన్, అజారుద్దీన్ తదితరులు ఉన్నట్టుగా తెలిసింది. అయితే ఈ స్థానానికి సీనియర్ న్యాయవాది, మాజీ ఎంపి అభిషేక్ మను సింఘ్వికి ఇప్పించాలని ఏఐసిసి అధిష్టానం భావిస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రానికి చెందిన నేతలు మాత్రం రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణకే ఆ సీటును కేటాయించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నట్టుగా తెలిసింది. ఇప్పటికే హైదరాబాద్ నుంచి (అంజన్‌కుమార్ యాదవ్ కుమారుడు) అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ అవకాశం కల్పించగా, మరొకరికి కూడా ఈ అవకాశం కల్పిస్తే కచ్చితంగా జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాం(గెస్ పార్టీ అన్ని స్థానాలను గెలిచే అవకాశం ఉంటుందని కొందరు నగరానికి చెందిన నాయకులు ఏఐసిసికి విన్నవించినట్టుగా తెలిసింది. అయితే ఈ సీటును ఆశిస్తున్న వారిలో జానారెడ్డి మాత్రం చివరిసారిగా తనకు ఈ అవకాశం కల్పించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నట్టుగా తెలిసింది. ఇప్పటికే ఆయన ఇద్దరు కుమారుల్లో ఒకరు ఎమ్మెల్యేగా, మరొకరు ఎంపిగా గెలిచారు. ఒకే ఇంట్లో ముగ్గురికి అధిష్టానం పదవులు ఇవ్వదని కాం(గెస్ నాయకులు పేర్కొంటున్నారు.



## బిసిల కోటాలోఅవకాశం కల్పించాలి: విహెచ్

ఇక హైదరాబాద్‌కు చెందిన నిరంజన్ పార్టీని నమ్ముకొని కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ పటిష్టతకు ఆయన ఎనలేని కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నే ఆయన తనకు కూడా ఈ సారైనా అవకాశం కల్పించాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నట్టుగా తెలిసింది. ఇక అజారుద్దీన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడంతో తనకు ఏదైనా పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. (ప్రస్తుతం రాజ్యసభ సీటు కోసం ఆయన పోటీ పడుతున్నట్టు గా తెలిసింది. ఇక వి.హనుమంతరావు కూడా గత పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం నుంచి పోటీ చేస్తానని తనకు అవకాశం ఇవ్వాలని పార్టీకి విన్నవించుకున్నారు. కొన్ని సమీకరణాల నేపథ్యంలో ఆయనకు ఆ టికెట్‌ను అధిష్టానం ఇవ్వలేకపోయింది. ఈసారైనా హైదరాబాద్ కోటా నుంచి బిసిల కోటాలో తన పేరును కూడా పరిగణలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నట్టుగా తెలిసింది. ఇలా ఎవరికి వారే ఈ సీటు కోసం (ప్రయత్నం చేయడం విశేషం.

## 14వ తేదీన ఉప ఎన్నిక నామినేషన్లు

కేశవరావు రాజీనామా చేసిన సమయంలోనే మాజీ ఎంపి అభిషేక్ మను సింఘ్వి పేరు వినిపించగా ఇప్పటికీ ఏఐసిసిలో అదే వైఖరి కొనసాగుతున్నట్లు కాం(గెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉప ఎన్నిక కోసం నామినేషన్లు ఈ నెల 14న (ప్రారంభం కానుండగా అప్పటిలోపు సిఎం రేవంత్ విదేశీ టూర్ ముగించుకొని హైదరాబాద్ వస్తారు. ఈ నేపథ్యంలోనే రాజ్యసభ సీటుపై మరింత స్పష్టత వచ్చే అవకాశముందని కాం(గెస్ వర్గాలు తెలిపాయి. రాజ్యసభ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేల సంఖ్యాబలం రీత్యా కాం(గెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని కాం(గెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణ నుంచి ఈ ఒక్క స్థానం భర్తీ అవుతున్నందున సొంత రాష్ట్రానికి చెందిన అభ్యర్థికి అవకాశం ఇవ్వకుండా ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వ్యక్తిని నిలబెట్టడంపై గాంధీభవన్‌లో ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలోనే తమను కూడా అధిష్టానం పరిగణలోకి తీసుకోవాలని తెలంగాణకు చెందిన సీనియర్ కాం(గెస్ నాయకులు డిమాండ్ చేస్తుండడం విశేషం.

# 'సీతారామ' రీ-డిజైన్ పేరుతో దుర్వినియోగం

● ఎల్ఆర్ఎస్ పథకం అమలు చేస్తాం ● అర్హులందరికీ ఆరోగ్యశ్రీ, తెల్ల రేషన్ కార్డులు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జర్నలిస్ట్ ఫైల్** /సత్తుపల్లి: ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి (ప్రారంభించిన రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ (ప్రాజెక్టు డిజైన్ పేరుతో పేదవాడి సొమ్ము దుర్వినియోగమైందని రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి (శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆనాడు ఆ (ప్రాజెక్టులకు రూ.2400 కోట్లతో 3.70 లక్షల ఎకరాలకు నీరందించేందుకు నిర్మాణ అంచనాలు రూపొందించి సగం పూర్తి చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వాటిని సీతారామ (ప్రాజెక్టుగా పేరు మార్చి రూ.18500 కోట్ల రూపాయల అంచనాతో టెండర్లు ఖరారు చేశారని అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో 8000 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. అందులోనూ పెండింగ్ ఉన్న 975 కోట్ల రూపాయల బిల్లులు తాము అధికారంలోకి వచ్చాక చెల్లించామన్నారు.గొప్పలకు ఆర్భాటాలకు పోయి పెంచిన ఆయకట్టు లక్షా 50 వేల ఎకరాలేనన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో యుద్ధప్రాతిపదికన ఖమ్మం జిల్లా రైతు కి సాగు నిర్వహించేందుకు ఏన్కూరు దగ్గర లింకు కెనాల్ ఏర్పాటుచేసి వైరా రిజర్వాయర్‌కు గోదావరి నీళ్లు తరలిస్తామని అన్నారు. దీని ద్వారా 1.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టును స్వీకరిస్తామని అన్నారు. వైరా, లంకాసాగర్ (ప్రాజెక్టు 9 మండలాల్లోని మధ్యతరహా మైనర్ చెరువులకు, లిఫ్టులకు సాగునీరు అందుతుందని అన్నారు. రైతులకు రుణమాఫీ చేసే పరిస్థితి లేనప్పటికీ రూ. 31 వేల కోట్ల రుణమాఫీ చిత్తశుద్ధితో కాం(గెస్ (ప్రభుత్వం అమలు చేసి రైతుల ముఖాల్లో ఆనందం చూస్తున్నామని అన్నారు. కొత్తగా తెల్ల రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం కేబినెట్ సబ్ కమిటీని వేశామన్నారు. అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లు అందిస్తామన్నారు. ధరణిను బంగాళాఖాతంలో తొక్కుతామన్నారు. కొత్త భూ హక్కుల చట్టం కోసం అనుభవజ్ఞుల, న్యాయ నిపుణుల సలహాలు స్వీకరిస్తామన్నారు. తెలంగాణలో భూమి ఉన్న (ప్రతి ఒక్కరు ఎక్కడ నివసించిన ధీమాగా ఉండే విధంగా కొత్త భూ చట్టం రూపొందిస్తుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం నాలుగేళ్ల (క్రితం (ప్రవేశపెట్టి ఏ ఒక్క దరఖాస్తు పరిష్కరించలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో (ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు, వక్ఫ్ బోర్డు భూములు, భూదాన భూములు మినహా మిగిలినవన్నీ ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా (క్రమబద్ధీకరిస్తామని అన్నారు. కాం(గెస్ అధికారంలోకి వస్తే కరువు కష్టాలు తప్పవని కరెంటు ఉండదని వర్షాలు పడవని బి ఆర్ ఎస్ నాయకులు శాపనార్థాలు పెట్టారన్నారు. జూలైలోనే నాగార్జున సాగర్ వంటి (ప్రధాని జలాశయాలను పొంగి (ప్రవహిస్తున్నాయన్నారు. ఈ కార్య(క్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, ఎంఎల్ఏలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంక(టావు, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి పొంగులేటికి తృటిలో తప్పిన ప్రమాదం

(ప్రధాన రహదారిపై కారు టైర్‌కు పంక్చర్

**జర్నలిస్ట్ ఫైల్** / వైరా: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. మంత్రి పొంగులేటి (ప్రయాణిస్తున్న



కారు గురువారం ఉదయం వైరా సమీపంలోని (ప్రధాన రహదారిపై పంక్చర్ అయింది. ఖమ్మంలోని తన నివాస గృహం నుండి ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, (ప్రగడవరం (గ్రామంలో ఓ (ప్రైవేట్ కార్య(క్రమానికి హాజరయ్యేందుకు మంత్రి బయలుదేరారు. వైరా హైలెవల్ వంతెన దిగిన తర్వాత జాతీయ రహదారిపై వెనక టైర్ పంక్చర్ కావటంతో కారు ఒక్కసారిగా కుదుపులకు గురైంది. వెంటనే (డ్రైవర్ అ(ప్రమత్తమై కారును వెంటనే నిలిపివేశాడు. కారు స్పీడ్ తక్కువగా ఉండటంతో ఎటువంటి (ప్రమాదం జరగలేదని, స్పీడ్ ఎక్కువగా ఉండి ఉంటే (ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు అన్నారు. ఈ ఘటనతో మంత్రి పొంగులేటి కాన్వాయ్ జాతీయ రహదారిపై కొద్దిసేపు నిలిచిపోయింది. అనంతరం మరో కారులో ఆయన అక్కడ నుండి (ప్రగడవరం వెళ్లారు.

# సంగారెడ్డిలో త్వరలో 500 పడకల ఆసుపత్రి

ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ మంజూరు చేస్తాం : మంత్రి దామోదర రాజనర్సింహ

**జర్నలిస్ట్ ఫైల్** /సంగారెడ్డి బ్యూరో: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. సంగారెడ్డిలోని జిల్లా (ప్రభుత్వ ఆసుప(త్రిలో 500 పడకల ఆసుప(త్రికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంగారెడ్డిలో త్వరలోనే 500 పడకల ఆసుప(త్రిని నిర్మించి (ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని అన్నారు. మాజీ ఎంఎల్ఏ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు (క్రాంతితో కలిసి మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు, కాలేజీలో వసతులను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుప(త్రిలో శానిటేషన్ కార్య(క్రమాలు నిరంతరం కొనసాగించాలని ఆసుప(త్రి సూపరిండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్‌ను ఆదేశించారు. జిల్లా ఆసుప(త్రికి ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్‌ను మంజూరు చేసే బాధ్యత తీసుకొని ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు అందేలా చేస్తామన్నారు.



మాతా శిశు సంక్షేమ దవాఖానాను పరిశీలించారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, అధికారులు, కాం(ట్రాక్టర్ తీరుపై ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఏ జగ్గారెడ్డి ఆ(గహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు మంత్రిని కలిసి రిపోర్ట్ చేయాలని జగ్గారెడ్డి చెప్పారు. ఈ కార్య(క్రమంలో ఇండ(స్ట్రియల్ ఇన్‌(ఫా(స్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మెన్ నిర్మలారెడ్డి, జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, డిఎంఈ వాణి, (ప్రిన్సిపాల్ సుధా పాల్గొన్నారు.

# హెచ్ఎండిఏలో మరో రెండు జోన్లు

ఉత్తర్వులు జారీ చేసిన (ప్రభుత్వం

మేడ్చల్, శంకర్‌పల్లి జోన్‌లు రెండుగా విభజన

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్:హెచ్ఎండిఏలో మరో రెండు జోన్లను అదనంగా ఏర్పాటు చేస్తూ (ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలంగా హెచ్ఎండిఏకు అనుమతుల కోసం భారీ గా దరఖాస్తులు వస్తుండడంతో నాలుగు జోన్‌లను కాస్త ఆరు జోన్లుగా మారుస్తూ హెచ్ఎండిఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు జోన్లను అదనంగా ఏర్పాటు చేయడం వల్ల వేగంగా అనుమతులు ఇవ్వొచ్చని, అధికారులకు పని భారం తగ్గుతుందని హెచ్ఎండిఏ భావిస్తోంది. చాలా రోజుల నుంచి జోన్ల పెంపు (ప్రతిపాదనలు హెచ్ఎండిఏ అధికారులు తెరపైకి తీసుకొచ్చినా (ప్రస్తుతం ఆ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ దానికి ఆమోదము(ద వేయడం విశేషం. (ప్రస్తుతం హెచ్ఎండిఏ పరిధిలో నాలుగు జోన్లు ఉన్నాయి. అందులో మేడ్చల్, ఘట్‌కేసర్, శంకర్‌పల్లి, శంషాబాద్‌లు ఉండేవి. (ప్రస్తుతం అందులో నుంచి మేడ్చల్‌ను రెండు జోన్లుగా శంకర్‌పల్లిని రెండు జోన్లుగా విభజించడంతో మొత్తం ఆరు జోన్లు అయ్యాయి. (ప్రస్తుతం మేడ్చల్ 1, మేడ్చల్ 2, శంకర్‌పల్లి 1, శంకర్‌పల్లి 2తో పాటు ఘట్‌కేసర్, శంషాబాద్‌లు జోన్లుగా ఏర్పడ్డాయి. దీంతో పాటు కొత్త జోన్‌లకు పిఓలను నియమించడంతో పాటు పాత జోన్‌లలో పనిచేసే పిఓలను కూడా వేరే చోటుకు బదిలీ చేశారు. పలువురు పిఓలపై అవినీతి ఆరోపణలు రావడం, చాలాఏళ్లుగా ఈ జోన్‌లలోనే వారి పని చేస్తుండడంతో వారిపై బదిలీ వేటు పడినట్టుగా తెలిసింది. హెచ్ఎండిఏ ఏడు జిల్లాల తో 7,282 కి.మీ. పరిధిలో విస్తరించి వుంది. దీంతో లేఔట్ అనుమతులు, నిర్మాణ అనుమతులను మరింత వేగవంతంగా మంజూరు చేసేందుకే ఈ జోన్‌ల సంఖ్యను పెంచినట్టు అధికారులు తెలిపారు.

# పారదర్శకంగా బదిలీలు చేపట్టాం

● ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో రోగుల సంరక్షణ సేవలు

నిరాటంకంగా సాగుతున్నాయి: మంత్రి దామోదర రాజనర్సింహ

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : దీర్ఘకాలికంగా ఒకే చోట ఉద్యోగ విధులను నిర్వహిస్తున్న 40 శాతం ఉద్యోగుల సర్వీసును గుర్తించి వారిని బదిలీలు చేశామని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఆసుప(త్రి పనితీరుకు, రోగుల సంరక్షణ సేవలకు ఏ విధంగా ఆటంకం కలగకుండా పారదర్శకంగా బదిలీలు చేపట్టామన్నారు. జిఒ 80 (ప్రకారం సూపర్ స్పెషాలిటీ సేవలలో అత్యవసరతను పరిగణలోకి తీసుకొని ఈ బదిలీల్లో స్పెషాలిటీ డాక్టర్లకు మినహాయింపు ఇచ్చామని తెలిపారు. వైద్యులు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను కాం(ట్రాక్టు పద్ధతిన ఈ ఏడాది మార్చిలో నియమించామన్నారు. వీటితోపాటు ఈ నెల 9న వైద్యులు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను కాం(ట్రాక్టు పద్ధతిన నియమించుకోవడానికి మళ్లీ షెడ్యూలు విడుదల చేశామని తెలిపారు.

## గాంధీ, ఉస్మానియా ఆస్ప(త్రులలో తగిన సంఖ్యలో వైద్యులు,సిబ్బంది

గాంధీ, ఉస్మానియా ఆస్ప(త్రులలో తగిన సంఖ్యలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉండి రోగుల సంరక్షణ సేవలను అందిస్తున్నారని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఈ ఆసుప(త్రుల్లో అందుబాటులో ఉన్న డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్ల సంఖ్యను 2023 ఆగస్టు 7 నాటికి, ఈ ఏడాది ఆగస్టు 7 వరకు మధ్య తేడాను మంత్రి గణాంకాలతో వివరించారు. ఉస్మానియా ఆసుప(త్రిలో గతేడాది ఆగస్టు 7న మొత్తం 2123 మంది వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు ఉండగా, అందులో 169 మంది డాక్టర్లు, 69 మంది జూనియర్ రెసిడెంట్లు, 1638 మంది పోస్ట్ (గ్రాడ్యుయేట్లు, 247 మంది నర్సింగ్ ఆఫీసర్‌లు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు 7న ఉస్మానియా ఆసుప(త్రిలో మొత్తం 2385 మంది ఉండగా, 266 మంది డాక్టర్లు, 218 సీనియర్ రెసిడెంట్లు, 1638 పోస్ట్ (గ్రాడ్యుయేట్స్, 263 నర్సింగ్ ఆఫీసర్లు ఉన్నారన్నారు. అదేవిధంగా గాంధీ ఆసుప(త్రిలో 2023 ఆగస్టు 7 నాటికి మొత్తం 1260 మంది డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు ఉండగా, అందులో 295 మంది డాక్టర్లు, 51 జూనియర్ రెసిడెంట్లు, 723 పోస్ట్ (గ్రాడ్యుయేట్లు, 191 నర్సింగ్ ఆఫీసర్‌లు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు 7న గాంధీ ఆసుప(త్రిలో మొత్తం 1491 మంది డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు ఉండగా, అందులో 362 మంది డాక్టర్లు, 119 మంది సీనియర్ రెసిడెంట్లు, 723 పోస్ట్ (గ్రాడ్యుయేట్స్, 287 నర్సింగ్ ఆఫీసర్లు ఉన్నారని మంత్రి వివరించారు. జిఒ 80 (ప్రకారం ఉస్మానియా, గాంధీ ఆసుప(త్రులలో సూపర్ స్పెషాలిటీ, ఇతర స్పెషాలిటీ సేవలకు నిర్వహించిన సాధారణ బదిలీలలో ఏ రకమైన ఆటంకం కలగలేదని అన్నారుర. రోగుల సంరక్షణ సేవలను నిరాటంకంగా కొనసాగుతున్నాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.

# ధరణిపై ప్రభుత్వానిది సాహసోపేత నిర్ణయం

● అఖిలపక్ష సమావేశానికి రాని పార్టీలు

సలహాలు, సూచనలు రెవెన్యూ శాఖ సె(క్రటరీకి రాతపూర్వకంగా పంపించాలి: కిసాన్ కాం(గెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్:ధరణి సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర (ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకోబోతుందని కిసాన్ కాం(గెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. ధరణి సమస్యల కారణంగా అనేక మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తాము అధికారంలోకి వచ్చాక స్పెషల్ (డైవ్ నిర్వహించి దాదాపు 2 లక్షల దరఖాస్తులను పరిష్కరించగలిగామన్నారు. ఆల్ పార్టీ మీటింగ్ అనంతరం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ విషయంలో ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహిస్తే బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాలేదని ఆయన విమర్శించారు. ఆ పార్టీలు సమావేశానికి రాకపోయినా పర్వాలేదు కానీ, మీ పార్టీ సలహాలు, సూచనలు రెవెన్యూ శాఖ సె(క్రటరీకి కనీసం రాతపూర్వకంగానైనా పంపించి సహకరించాలని ఆయన కోరారు. ఇది (ప్రజలకు ఉపయోగపడే అంశమని అందువల్ల అందరూ సహకరించాలని ఆయన కోరారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కావద్దన్నదే తన (ప్రయత్నం అని చెప్పారు.

## కొత్త రెవెన్యూ చట్టంపై అఖిలపక్ష సమావేశం

కొత్త రెవెన్యూ చట్టంపై గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. హైదరాబాద్ ఫతే మైదాన్ క్లబ్‌లో ఈ పార్టీ సమావేశం జరిగింది. ధరణి అధ్యయన కమిటీ కన్వీనర్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సిపిఐ, సిపిఎం, టిజెఎస్ పార్టీలతో సహా ధరణి సమస్యలపై పోరాటం చేసిన నేతలు, మేధావులు హాజరయ్యారు. కొత్త చట్టంలో ఉండాల్సిన అంశాలపై నేతలు, మేధావుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ అఖిల పక్ష సమావేశానికి బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం పార్టీలు దూరంగా ఉన్నాయి.

# ఆరేళ్ల బాలికపై గొర్రెల కాపరి అత్యాచారం

పోలీసుల అదుపులో నిందితుడు

ఆసుప(త్రికి బాధితురాలి తరలింపు

**జర్నలిస్ట్ ఫైల్** /కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఆరేళ్ల మైనర్ బాలికపైగొ(రెల కాపరి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం సాయం(త్రం జరుగగా, గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం (ప్రకారం...కొల్లాపూర్ పట్టణంలోని ఒక కాలనీకి చెందిన బాలిక రెండవ తరగతి చదువుతోంది. సాయం(త్రం పాఠశాల వదిలిన తర్వాత ఆమె ఇంటికి వచ్చింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆ బాలికను పరిసర (ప్రాంతంలో గొ(రెలు మేపుతున్న కాపరి గమనించి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డిఎస్‌పి శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిందితుడిని గద్వాల జిల్లా, మానవపాడు మండలానికి చెందిన నర్సింహ (45)గా పోలీసులు గుర్తించారు. అయితే, ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. బాలికను చికిత్స నిమిత్తం ఆసుప(త్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

# కల్మశంలేని అనుబంధాలకు ప్రతీకలు ఆదివాసీలు: సిఎం రేవంత్

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా

గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి



**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్:నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మూలవాసులుగా, అమ్మలాంటి అడవికి తోడుండే భూమిపుత్రులుగా, కల్మశంలేని అనుబంధాలకు ప్రతీకలుగా ఆదివాసీలు నిలుస్తారని, అలాంటి గిరిజనుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమాభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఓ సందేశంలో తెలిపారు. రూ. 17,056 కోట్ల కేటాయింపుతో బడ్జెట్ లో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గతంలో పేరుకు పంచాయతీలుగా మారినా పైసా నిధులు లేక నిర్లక్ష్యానికి గురైన గిరిజన గూడేల్లో రోడ్లు, విద్యుత్, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం సంకల్పించిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

# రాజ్ తరుణ్‌కు హైకోర్టులో ఊరట

ముందస్తు బెయిల్ మంజూరు

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : తెలుగు సినీ హీరో రాజ్ తరుణ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట దక్కింది. హైకోర్టు ధర్మాసనం రాజ్ తరుణ్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చింది. తనపై నమోదైన కేసులో ఆయన అరెస్టు నుంచి రక్షణ కోసం హైకోర్టు నుంచి ముందస్తుగా బెయిల్ పొందారు. రాజ్ తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య ఆయనపై కొద్ది రోజుల క్రితం నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. రాజ్ తరుణ్, తాను సహజీవనం చేశామని ఇప్పుడు ఆయన తనను మోసం చేసి పట్టించుకోవడం లేదని లావణ్య ఫిర్యాదు చేసింది. సహజీవనం తర్వాత తాము రహస్యంగా వివాహం కూడా చేసుకున్నామని లావణ్య ఆరోపిస్తోంది. తనను వదిలేసి ఇప్పుడు రాజ్ తరుణ్ వేరే మహిళతో తిరుగుతున్నాడని ఆరోపించింది. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజ్ తరుణ్‌పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన్ను విచారణకు రావాల్సిందిగా నోటీసులు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో రాజ్ తరుణ్ హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. దీంతో కోర్టు రాజ్ తరుణ్ కు కొన్ని షరతులతో కూడిన ముందస్తు బెయిల్ ఇచ్చింది. రూ.20 వేలతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించింది.

# సిఎం రేవంత్‌రెడ్డి పర్యటనపై ఓర్వలేక బిఆర్ఎస్ ఆరోపణలు

రేవంత్ సోదరుడు పెట్టుబడులు పెడితే తప్పేంటి?

ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్:బాల్క సుమన్, క్రిశాంక్‌లు సిఎం రేవంత్‌రెడ్డి పర్యటనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్‌కు, బాల్క సుమన్, క్రిశాంక్‌ల మధ్య చెడినట్లు ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సిఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం కావాలని కెటిఆర్ కోరుకున్నారని ఆయన తెలిపారు. ఓడిపోయిన నైరాశ్యంలో బిఆర్ఎస్ నేతలు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో నిరుద్యోగుల ఉద్యోగ కల్పన కోసం సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులు కృషి చేస్తున్నారన్నారు. పెట్టుబడుల కోసమే సిఎం, మంత్రులు అమెరికా వెళ్లారన్నారు. ఓర్వలేక సిఎం రేవంత్ రెడ్డిపై ఆయన కుటుంబంపై కొందరు విషం కక్కుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డి సమీక్ష జరిగేటప్పుడు కాంగ్రెస్ ఇన్‌చార్జీ తిరుపతి రెడ్డి అధ్యక్షత వహించారని ఆయన తెలిపారు. కొండల్ రెడ్డి ఆస్ట్రేలియా టూర్ అధికారిక పర్యటన కాదని ఆయన స్పష్టం చేశారు. ఇంకో సోదరుడుకి అమెరికాలో స్వచ్ఛ్ బయో కంపెనీ ఉందని, దాని ద్వారా తెలంగాణలో పెట్టుబడులు పెడితే తప్పేంటి? దాని మీద ఎందుకు రాజకీయం చేస్తున్నారు అని ఆయన నిలదీశారు. పది సంవత్సరాల్లో కెసిఆర్ కుటుంబం మొత్తం తెలంగాణలో విస్తరించిందన్నారు. రేవంత్ రెడ్డి ఎనిమిది నెలల్లో కుటుంబాన్ని ఎక్కడా చూపించలేదన్నారు. భద్రాచలంలో శ్రీరాముడి కల్యాణం సందర్భంగా ఆయన మనుమడు తలంబ్రాలు తీసుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. కుటుంబ పాలన అంటే కెసిఆర్‌దని, రేవంత్ రెడ్డిది కాదని, కావాలనే బట్ట కాల్చి మీద వేస్తున్నారన్నారు.

# 10 రోజుల్లో 'నైనీ'లో చెట్ల గణన

సింగరేణి విజ్ఞప్తిపై ఒడిశా ప్రభుత్వం సానుకూల స్పందన



**జర్నలిస్ట్ ఫైల్** / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ఒడిశా పర్యటన తరువాత నైనీ బొగ్గు బ్లాక్ సంబంధించి మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 643 హెక్టార్ల రిజర్వు అటవీ భూమిని సింగరేణికి బదలాయిస్తూ ఒడిశా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా తాజాగా 140 హెక్టార్ల గ్రామ అటవీ భూమిని కూడా అప్పగించడంపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా చెట్ల గణన, తొలగింపు ప్రక్రియకు కూడా పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజాను ఆయన కోరారు. దీనిపై అహూజా సానుకూలంగా స్పందించారు. తన విజ్ఞప్తి మేరకు 10 రోజుల్లో చెట్ల గణన ప్రక్రియ చేపట్టే విషయంపై ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

# గైడ్‌కాస్ట్‌లో 'నారాయణ'2వ ఎపిసోడ్ రిలీజ్

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన నారాయణ, గైడ్‌కాస్ట్‌లోని రెండవ ఎపిసోడ్‌ను యూట్యూట్ వేదికగా విడుదల చేసింది. ఈ గైడ్‌కాస్ట్‌లో పిల్లల స్నేహాల విషయంలో తల్లిదండ్రుల పాత్ర..? గొప్ప స్నేహాలు పెంపొందించటంలో తల్లిదండ్రులు ఎలా సహాయం చేయవచ్చు..? అనే అంశాలపై చర్చించారు. ఈ గైడ్‌కాస్ట్‌లో ప్రముఖ సైకాలజీ నిపుణులు విజయలక్ష్మి తమ విలువైన అభిప్రాయాలను పంచుకున్నారు. పిల్లల జీవితంలో స్నేహం పాత్రను సవివరంగా ఆమె వివరించారు. స్నేహం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా కీలకమైనదని, తల్లిదండ్రుల తర్వాత స్నేహితుల ప్రభావమే అధికంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్నేహంలో చాలా భావోద్వేగాలు ఇమిడి ఉంటాయని, కౌమారదశలో భావోద్వేగాల తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. యుక్తవయస్సు వచ్చేసరికి స్నేహబంధాలతో పాటు తోటి వారితోనూ సత్సంబంధాలు కలిగి ఉండటం తెలుసుకుంటారని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల స్నేహాల విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలతో ఎక్కువ సమయం గడపటం, వారి బలాలను అంచనా వేయటం, పిల్లలకు సురక్షితమైన, భవిష్యత్తుపై భయందోళనలు లేని వాతావరణాన్ని కల్పించటంలో తల్లిదండ్రుల సహాయసహకారాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## 100 మందికి పైగా మనస్తత్వవేత్తలతో నారాయణ దిశ సేవలు

విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి నారాయణ దిశా కార్యక్రమాన్ని ప్రారంభించింది, 2017లో విజయలక్ష్మి (ఎం.ఏ, సైకాలజీ) ఆధ్వర్యంలో మొదలైన ఈ కార్యక్రమం గణనీయమైన సేవలు అందిస్తోంది. 100 మందికి పైగా మనస్తత్వవేత్తలతో, 283 పాఠశాలలు, 279 కళాశాలల్లో దిశ సేవలు అందించింది. సంవత్సరానికి 3,500 లకు పైగా విద్యార్థులతో ముఖాముఖి చర్చలు నిర్వహించింది. గత సంవత్సరం 3,00,000 మంది విద్యార్థులకు మద్దతుగా నిలిచింది. సుమారు 15,000 మందికి వ్యక్తిగతంగా సేవలు అందించింది.

# పల్నాడు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దుదాం

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్






**పల్నాడు, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** పల్నాడు జిల్లా అధ్యక్షతన జాయింట్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలు, సమన్వయం, ఉమ్మడి భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దడానికి విస్తృత చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. మంగళవారం 31/ 7/ 2024న కలెక్టరేట్ లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ – డి సి పి యు సారధ్యంలో బాలలు – మత్తు పదార్థాలు మరియు మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలు గురించి జిల్లాలో పనిచేస్తున్న కీలక ముఖ్య శాఖలైన పోలీసు శాఖ, విద్యా శాఖ, ఎక్సైజ్ శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, పంచాయతి రాజ్ శాఖ, సమాచార,పౌర సంబంధాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య,ఆరోగ్య శాఖ, రైల్వే,లేబర్ డిపార్ట్మెంట్ మొదలగు శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులతో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు శ్రీమతి పద్మావతి జిల్లాలో డ్రగ్స్ నియంత్రణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు ద్వారా పూర్తి సమాచారాన్ని అడిగి రివ్యూ చేసి తెలుసుకున్నారు. అలాగే చేపట్టవలసిన నియంత్రణ చర్యలు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ షాప్స్ మరియు మద్యం దుకాణాల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం డ్రగ్స్ నియంత్రణ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు నిపుణులు సహకారంతో ఎటువంటి చర్యలు చేపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ క్లబ్స్ ఏర్పాటు చేయడం ద్వారా, పిల్లలు మరియు వారి తల్లిదండ్రులతో కలిసి కమిటీలు మరియు మీటింగ్ లు జరపాలని, అవసరమైనచో కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేయడం జరిగినది. లిక్కర్ షాపులు మరియు బార్లు స్కూల్స్ కి దగ్గరగా ఉన్నచో కఠినమైన చర్యలు తీసుకొనబడును అని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసము అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసం మరికొన్ని ప్రత్యేక కౌన్సిలింగ్ విధానాలు, పునరావాస కేంద్రాలు, drug De-addiction center పల్నాడు జిల్లా లో ఏర్పాటుతో పాటు పాఠశాలలు, కళాశాలలు, వివిధ పునరావాస కేంద్రాలు మరియు వసతి గృహాల్లో మనస్తత్వ వేత్తల నియామకం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అధిక శాతం అధికారులు కోరడం జరుగుతుందని తెలిపారు. పోలీసులు స్కూల్స్, కాలేజీల దగ్గర ప్రత్యేక నిఘా పెట్టడం, బాలలకు సంబంధించిన ప్రత్యేక విభాగం ఎస్ జె పి యు ద్వారా బాలలకు సంబంధించిన హక్కుల కు భంగం వాటిల్లకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే పోలీస్ వారు తప్పిపోయిన మరియు వదిలివేయబడిన బాల బాలికలను బాలల సంక్షేమ కమిటీ వారి ముందు ప్రవేశపెట్టి వారికి సంబంధిం చిన విషయాలను వెబ్ సైట్ ద్వారా మిగిలిన అన్ని స్టేషన్స్ కు తెలియజేయాలని కమిషన్ సభ్యులు శ్రీమతి పద్మావతి తెలిపారు. సెబ్ అధికారులు వీటి నిర్మూలనపై విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రైల్వే శాఖాధికారులు గవర్నమెంట్, రైల్వే పోలీసు అధికారుల సమన్వయంతో పిల్లలతో మాదక ద్రవ్యాల ను సరఫరా చేసే వ్యక్తుల మూలాలపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. అలాగే ఔషధ నియంత్రణాధికారులు మత్తును కలిగించే వివిధ ఔషదాలను పిల్లలకు అమ్మకుండా కట్టుదిట్టమైన చర్యలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖాధికారులు ఎలక్ట్రానిక్,ప్రింట్ మీడియా ద్వారా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల పిల్లల భవిష్యత్ ఏ విధంగా ఛిద్రం అవుతుందో డాక్యుమెంటరీలు రూపంలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి సమీక్ష సమావేశాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పిల్లలకు చక్కని ఫలితాలు అందించే దిశగా అడుగులు వేస్తున్నట్టు బత్తుల పద్మావతి చెప్పారు. డిఆర్ఓ పిల్లల విషయంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ మరియు డి సి పి యు యూనిట్ వివిధ శాఖల సమన్వయంతో బాల బాలల హక్కులను పరిరక్షించాల్సిందిగా వారి భద్రతకు రక్షణ కల్పించాల్సిందిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా పిల్లలకు తగిన సహాయం అందించాలని వారి సలహాలు సూచనలు తీసుకొని పిల్లలకు మంచి భవిష్యత్తుని అందజేయాలని, బాపట్ల జిల్లా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీమతి పద్మావతి కోరారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నియంత్రణకి సంబంధించిన శాఖల ప్రధాన అధికారులతో సమీక్ష జరిపి తగు చర్యలు తీసుకోవాలని మరియు పిల్లలకు సంబంధించిన అంశాలలో సహాయం కావలసినవారు జిల్లాస్థాయిలో ఏర్పాటు చేయబడిన డిసిపియు ద్వారా బాలలకు రక్షణ మరియు సంరక్షణ అందించబడుతుందని వీఆర్వో తెలియజేశారు.

**మానవ అక్రమ రవాణా వ్యతిరేక**

ఈ సమావేశంలో, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారి కోగంటి ఉమారాణి బాలల సంరక్షణ అధికారి, అడిషనల్ ఎస్పీ రాఘవేంద్రరావు, ఆరోగ్యశాఖ డి.యం. హెచ్. ఓ, రవి కుమార్, సెబ్.ఎక్సైజ్, జిల్లా పరిషత్, విద్యాశాఖ డిప్యూటీ సూపర్డెంట్ డీఈవో ,ఎక్సైజ్ డిపార్ట్మెంట్ , డ్రగ్ కంట్రోల్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ , ఆరోగ్య, సమాచార పౌర సంబంధాల, రైల్వే పోలీస్ శాఖ వెంకట సుబ్బమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## విద్యాకమిటి ఛైర్మన్‌గా బావిశెట్టి వీరరాఘవయ్య





**నూజివీడు, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీకీ ఎలక్షన్స్ నిర్వహించడ మైనదని పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధికారాణి తెలిపారు. కమిటీ ఛైర్మన్ గా భావిశెట్టి వీరరాఘవయ్య వైస్ ఛైర్మన్ గా శిరీష ఎంపికైనారు. ఆరవ తరగతి నుండి పదవతరగతి వరకు క్లాసు నుంచి ముగ్గురు చొప్పున మొత్తం పదిహేను మంది సభ్యులుగా సెలెక్ట్ చేయడం జరిగినది అని తెలిపారు. నూతనంగా ఎన్నికైన స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధి కోసం పాటుపడతానని, స్కూల్ రాని విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తో మాట్లాడి రోజూ స్కూల్ కువచ్చే విధంగా చేస్తానని తెలియ చేసారు. నాకు సహకరించిన గ్రామ పెద్దలు, గ్రామస్థులు, తల్లి,దండ్రులకు కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు మరియు నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా కుట్టు మెషిన్ పంపిణి కార్యక్రమం



**సింగరాయకొండ, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** కొండపి నియోజకవర్గం సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ యువనాయకులు మాగుంట రాఘవ రెడ్డి ఏర్పాటు చేసిన మాగుంట చారిటబుల్ ట్రస్ట్ మరియు సింగర్ కంపెనీ ఆధ్వర్యంలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మహిళలలకు కుట్టు మెషిన్ పంపిణి కార్యక్రమం జరిగింది.మహిళా సాధికారత లో భాగంగా ఈ విడత లో 24 ఉచిత కుట్టు మెషిన్ సెంటర్లు ను ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం వ్యాప్తంగా ఏర్పాటు చేసినారు. అందులోని ఊళ్లపాలెం శిక్షణ కేంద్రం లో కుట్టు మెషిన్ పంపిణి కార్యక్రమంలో 18 మంది శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలలకు కుట్టు మెషిన్ లు పంపిణి చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో ఊళ్లపాలెం సర్పంచ్ పాకనాటిఅనసూర్యమ్మ రోటరీ క్లబ్ కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు శ్రీ సాగర్ రెడ్డి శ్రీ మోటుపల్లి కిషోర్,స్థానిక టి డి పి నాయకులు సాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, నూతలపాటి కృష్ణ చైతన్య, అక్కల ప్రసాద్ రెడ్డి, ధన్యాసి హరిబాబు మరియు పలువురు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## పోలవరంలో విద్యా కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఏకగ్రీవ ఎన్నిక



**గూడూరు, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** కృష్ణాజిల్లా గూడూరు మండల పరిధిలోని పోలవరం గ్రామంలో ఎంపీయుపి స్కూల్లో గురువారం మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో విద్యా కమిటీ ఛైర్మన్ గా కారుపర్తి చిన్నం ఉలక్కి , వైస్ ఛైర్మన్‌గా గెడ్డం కీర్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు హెచ్ ఎం బొప్పన విజయలక్ష్మి తెలిపారు. ఏకగ్రీవ ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా

# కంప్యూటర్‌ల వితరణ





**కలిదిండి, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** కలిదిండి మండలం ఆవకూరు గ్రామ పంచాయితీ పరిధిలోని ఎంపీపీ ఎస్ ఆవకూరుకు నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా సిఎస్ఆర్ ఫ్రెండ్ సౌజన్యంతో కంప్యూటర్ 6, ఇన్వెటర్ 1, ప్రింటర్ 1, టేబుల్స్ 6, చైర్స్ 6, అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థ నుండి పరసా శివప్రసాద్, నున్న సుధీర్ కుమార్, కే ఆనంద్, వి. నరేంద్ర, ఎం సురేష్ హాజరయ్యారు. సంస్థ ప్రతినిధులలో ఒకరైన పరసా శివప్రసాద్ స్వగ్రామం ఆవకూరు కావడంతో చదువుకున్న స్కూల్ చదువుకున్న స్కూల్ కి ఈ విధంగా చేయూత నివటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ఎన్. నరసయ్య, సిహెచ్ పార్వతి, ఎన్ చంద్రకళాధరరావు, శ్రీనివాసరావు, షణ్ముఖ, సీతాపతి గుప్తా, జట్టు వీర వెంకట సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మేకా రామారావు మాట్లాడుతూ ఈ విధంగా సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థకు వారి ప్రతినిధులకు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంతంగా పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు



**ఆగిరిపల్లి , ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** ఆగిరిపల్లి మండలం లో ఈరోజు 50 ప్రభుత్వ పాఠశాలలో 49 పాఠశాల లకు విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారని కేవలం ఒక “అడవి నెక్కలం”పాఠశాలలోనే తగిన కోరం లేక ఎన్నికలు నిలిపివేయబడ్డాయని మండల విద్యాధికారి వన్ సర్వేశ్వరరావు తెలియజేశారు .ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ మె%శీ%బర్లు గా 24 మంది ఎన్నుకోబడ్డారని అందులో చైర్మన్ గా ఆవుల నరేష్, వైస్ చైర్మన్ గా భట్టుమర్తి స్రవంతి ఏకగ్రీవంగా ఎన్నుకొనబడినారని ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆగిరిపల్లి సర్పంచి లక్ష్మీ విక్టర్ బాబు పాల్గొన్నారు అని మరియు పోలీస్ శాఖ వారు కూడా తగిన భద్రత కల్పించి సహకరించారని ఎంఈఓ 2 ఆనంద్ కుమార్ తెలియజేశారు. శోభనాపురం ఎంపీ యూపీ పాఠశాల లో ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలలో చైర్మన్ గా దాసరి రాంప్రసాద్, వైస్ చైర్మన్ గా చెన్నూరి ధనలక్ష్మి ఎన్నికైనారని, బొద్దనపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎన్నికలలో చైర్ పర్సన్ గా అలవాల శిరీష, వైస్ చైర్ పర్సన్ గా మిక్కిలి సౌందర్య ఎన్నికైనరని వారికి శోభనాపురం సర్పంచి నక్కనబోయిన వేణు ఆయా పాఠశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మ వారి గూడెం పాఠశాల లో ఏకగ్రీవంగా జరిగిన చైర్ పర్సన్ గా రాణి మేకల శివ నాగ మల్లేశ్వర రావు, వైస్ చైర్ పర్సన్ గా చౌటపల్లి ప్రియాంకలను కమిటీ సభ్యులందరూ ఎన్నుకున్నారని, పాఠశాలకు అవసరమైన జెండా దిమ్మను నిర్మించుటకు నూతనముగా ఎన్నికైన చైర్ పర్సన్ రాణి మేకల శివనాగ మల్లేశ్వరరావు తన సొంత నిధులతో వెచ్చించి జండా దిమ్మను నిర్మింప చేస్తానని హామీ ఇచ్చారని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారని వంశీ విశిష్ట తెలియజేశారు

## పల్లెర్లమూడిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన దోషిని

# కఠినంగా శిక్షించాలి

## ఎస్టీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చిన జనసేన నాయకులు



**నూజివీడు, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** జనసేన పార్టీ పల్లెర్లముడి గ్రామ నాయకుడు సాయి పవన్ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీవాసులు అందరూ కలిసి.... 4/8/24న మైనర్ బాలికపై జరిగిన దారుణం గురించి తెలుసుకొని ఏపీ ఎస్టీ కమిషనర్ శంకర్ నారాయణ గారు పల్లెర్లముడి గ్రామానికి విచ్చేశారు వారికి జనసేన పార్టీ తరపునా ఆ దారుణానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగినది వారు సాలకూలంగా స్పందించారు వారికి జరగాల్సిన న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు.

## నూజివీడు నియోజకవర్గంలో గత సంవత్సరం కన్నా

# 3 రెట్లు పెరిగిన సభ్యత్వ నమోదు

## – సమన్వయకర్త బర్మాఫణి బాబు



**నూజివీడు, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం లో జనసేన పార్టీ అధిష్టానం తలపెట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారంతో ముగిసిందని నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బర్మా ఫణి బాబు అన్నారు. 2023 సభ్యత్వ నమోదు కన్నా మూడు రెట్లు అధికంగా నూజివీడు నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,వీర మహిళలు ఎంతో కష్టపడి వాలంటీర్ల ద్వారా 4వేలకు పైగా సభ్యత్వ నమోదు చేసినట్లు బర్మా ఫణి బాబు అన్నారు.. నూజివీడు నియోజకవర్గంలో పాశం నాగబాబు 730 సభ్యత్వాలతో మొదటి స్థానంలో ఉన్నట్లు అలాగే నూజివీడు నియోజకవర్గంలో 50 మందికి పైగా సభ్యత్వాలు నమోదు చేసే వాలంటీర్ గా పనిచేశారని ఈ సందర్భంగా ప్రతి ఒక్క వాలంటీర్ కి బర్మా ఫణి బాబు అభినందనలు తెలిపారు.. వచ్చే సంవత్సరం నాటికి మరింత సభ్యత్వాలు చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో నూజివీడు నియోజకవర్గ సభ్యత్వాలు ఉండేలా కృషి చేస్తామని బర్మా ఫణి బాబు తెలిపారు..

## భాదిత బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి





**నూజివీడు, ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో అత్యాచారానికి గురైన 4 సంవత్సరాల బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ఎస్.టి. కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. పల్లెర్లమూడి లో బాలిక ఇంటికి గురువారం వెళ్లి బాలిక కుటుంబాన్ని శంకర్ నాయక్ పరామర్శించారు. జరిగిన సంఘటనపై బాలిక తల్లితండ్రులను శంకర్ నాయక్ ఓదార్చారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ జరిగిన సంఘటన దురదృష్టకరమైనదన్నారు. నాగరిక సమయంలో అభం శుభం తెలియని బాలికపై అఘాయిత్య ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తప్పుచేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి, కేసు విచారణను వేగవంతం చేస్తున్న పోలీసు, జిల్లా యంత్రాంగాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. సంఘటనను ఫోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని, అఘాయిత్యానికి గురైన బాలిక కుటుంబానికి .5 లక్షల రూపాయల వరకు పరిహారం అందించాలన్నారు. నివేదికలు అందిన వెంటనే 50 శాతం పరిహారంగా 2. 50 లక్షల రూపాయలు అందించాలని, ఛార్జ్ షీట్ దాఖలు చేసిన తరవాత 25 శాతం, నిందితుడికి శిక్ష పడిన తర్వాతా మిగిలిన 25 శాతం పరిహారం అందించాలని ఆయన కోరారు. సదరు నిరుపేద గిరిజన కుటుంబానికి తీరని అన్యాయం జరిగిందని , జరిగిన సంఘటనను ప్రత్యేకమైన కేసుగా పరిగణించి, కేసును త్వరితగతిన విచారణ పూర్తి చేసి, దోషికి కఠిన మైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని శంకర్ నాయక్ అధికారులను కోరారు. కోటరామచంద్రాపురం ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి జి. శీను కుమార్, ఇంచార్జి ఆర్డీఓ భాస్కర్, ఇంచార్జి తహసీల్దార్ సుబ్బారావు, సీడీపీ ఓ ఎస్.వై. నూరాని, వ్యవసాయాధికారి చాముండేశ్వరి, గొల్లపల్లి పి హెచ్ సి వైద్యాధికారి నెజ్మా ,రురల్ సి ఐ రామకృష్ణ, పోలీసు, రెవిన్యూ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

## వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో,

# పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

## హెచ్ఎం సిహెచ్ శౌరీలు





**కలిదిండి , ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం వెంకటాపురం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్కూల్) నందు గురువారం పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొని, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వేములవాడ రామకృష్ణ, వైస్ చైర్మన్ గా పేరం నిరీష, ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ శౌరీలు తెలిపారు. ఎక్స్ అఫీషియో వార్డు సభ్యులుగాసానబోయిన విష్ణుమూర్తి, కో ఆప్టేడ్ సభ్యులుగా గుడిపాటి శ్రీరామకృష్ణ, కోలా శ్రీకాంత్ ఎంపికయ్యారన్నారు కలిదిండి మార్కెట్ యార్డ్ మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి (నాని )మరియు స్థానిక గ్రామ సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు లు చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ నిరీష, మరియు ఇతర సభ్యులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు సిహెచ్ శౌరీలు, ఉపాధ్యాయులు బాలాజీ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కూరెళ్ల ఏడుకొండలు, మరియు దేశి నాగబాబు, కట్టా నాగబాబు, పరస వెంకన్న బాబు,కరేటి కృష్ణారావు,మారగా ని శ్రీనివాసరావు, విద్యార్థులు తల్లిదండ్రులు, మరియు కుక్కింగ్ ఏజెన్సీ ఆల సరోజినీ,కరేటి రామ సీత, కూరెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ



**జగ్గయ్యపేట , ఆగస్టు 09, జర్నలిస్ట్ ఫైల్ :** కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కర్లపాటి పూజ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, నిరు పేద మహిళలకు పౌష్టికాహారాన్ని అందజేయడం జరిగిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్లపాటి మాట్లాడుతూ ట్రస్టు సేవలు భవిష్యత్తులో కూడా కొనసాగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎనిమిది వేల రూపాయల విలువైన ఆహార సామాగ్రిని అందజేస్తున్నామని తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో శ్రీదేవి, శ్రేయస్సు సిబ్బంది లక్ష్మీ తిరుపతమ్మ, విజయకుమారి, రాజశేకర్ , ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్... అసెంబ్లీకి రానడం పద్ధతి కాదు



**● స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** 'జగన్' ఉత్త ఎమ్మెల్యే మాత్రమే.. ముఖ్యమంత్రి కాదని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ప్రజలు ఆయన్ను ఎన్నుకున్నారు కాబట్టి అసెంబ్లీకి రావాలని సలహా ఇచ్చారు. అన్ని పార్టీలకు ఇచ్చినట్లే తనకూ అవకాశం ఇస్తానని తెలిపారు. అంతేతప్ప ఎమ్మెల్యేగా గెలిచి సభకు రాను అనడం పద్ధతి కాదని స్పష్టం చేశారు.

జగన్‌ను ప్రజలు ఎన్నుకున్నారని.. ఆయన్ను ఎన్నుకుంటే మా ప్రాంతం బాగుపడుతుందని అనుకుని ప్రజలు ఎన్నుకున్నారని అయ్యన్నపాత్రుడు అన్నారు. అది పక్కనబెట్టి నేను అసెంబ్లీకి రానని జగన్ అంటున్నాడని.. అసెంబ్లీకి రానడం పద్ధతి కాదని హితవుపలికారు. పగలు ఉంటాయి.. పోతాయి.. ప్రజలు ఎన్నుకున్నారు కాబట్టి అసెంబ్లీకి వచ్చి సమస్యలపై మాట్లాడాలని సలహా ఇచ్చారు. స్పీకర్‌గా తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వనని ఎందుకు ఊహించుకుంటున్నారని ప్రశ్నించారు. అన్ని పార్టీల వాళ్లకు ఇచ్చినట్లే వాళ్లకూ అవకాశం ఇస్తానని స్పష్టం చేశారు.

అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చినట్లే వైసీపీకి అవకాశం ఇస్తానని.. కాకపోతే కొన్ని కండీషన్లు ఉన్నాయని అయ్యన్నపాత్రుడు చెప్పారు. సభలో మెంబర్స్‌ను బట్టి క్వశ్చన్స్ వేయొచ్చని చెప్పారు. సభలో తెలుగు దేశం పార్టీకి ఎక్కువ మెంబర్స్ ఉన్నారు కాబట్టి వాళ్లు ఎక్కువ క్వశ్చన్స్ వేయొచ్చని చెప్పారు. ఆ తర్వాత జనసేన పార్టీకి ఎక్కువ క్వశ్చన్స్ వేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఆ తర్వాత కోటా బీజేపీకి ఉంటుందని.. దాని తర్వాత కోటా వైసీపీకి వస్తుందని వివరించారు. అంతేకానీ తనకే అన్ని క్వశ్చన్స్ అడిగే ఛాన్స్ ఇవ్వాలంటే కుదరదని అన్నారు. దానికి కొన్ని రూల్స్, పద్ధతులు ఉంటాయని తెలిపారు. అవన్నీ తెలుసుకుని జగన్ అసెంబ్లీకి రావాలని కోరారు.

ప్రజలు ఎన్నుకున్నారు కాబట్టి మీరు అసెంబ్లీకి రావాలని జగన్‌కు అయ్యన్నపాత్రుడు సూచించారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర సమస్యల గురించి మాట్లాడాలని సూచించారు. పద్ధతి ప్రకారం ఎంత టైమ్ ఇవ్వాలో అంత టైమ్ ఇస్తానని తెలిపారు. అంతేతప్ప సభకు రానంటే ప్రజలు ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు.

## ఆరోగ్యశ్రీపై తప్పుడు ప్రచారం.. వైసీపీపై సత్య కుమార్ ధ్వజం



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆరోగ్యశ్రీని కూటమి ప్రభుత్వం తీసేస్తుందని కొంతమంది పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆరోపించారు. నెల్లూరులో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సత్య కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వంలో ఏపీని పూర్తిగా అవినీతి మయం చేశారని.. అన్ని వ్యవస్థలను నాశనం చేశారని మండిపడ్డారు. ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం నుంచి రూ.400 కోట్లను దారి మళ్లించారని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. ప్రభుత్వ శాఖలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. జగన్ ప్రవేశపెట్టిన జె బ్రాండ్ మద్యం వల్లే రాష్ట్రంలో పలువురు కిడ్నీ, లివర్ వ్యాధుల బారిన పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీని తీసేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని... ఆరోగ్యశ్రీ పేరుని మాత్రమే మార్చామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. ఏపీలో జగన్‌ను ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. చివరికి ఆయన తల్లి, చెల్లి కూడా నమ్మడం లేదని విమర్శించారు. అందుకే ఢిల్లీ వెళ్లి అబద్ధాల డ్రామా ప్రారంభించారని ఎద్దేవా చేశారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను ఇస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మరింత ప్రగతిని సాధిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసమే చట్టంలో సవరణలు చేస్తోందని.. దీనిని వైసీపీ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. దేశంలో రక్షణ శాఖ, రైల్వేల తర్వాత వక్ఫ్ వద్దే అధికంగా భూములు ఉన్నాయని చెప్పారు. దేశంలో 9 లక్షల ఎకరాల భూములు వక్ఫ్ బోర్డుకు ఉన్నాయని.. వాటి ఆస్తుల పరిరక్షణ కోసమే కొత్త సవరణలని కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.

## శ్రీశైలంలో ఆలరిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమాలు



**శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సి.ఎం. హరిప్రియ బృందం చే భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ భక్తి సంగీత కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమములో వాతాపి గణపతిం, భో శంభో... శివశంభో, శంకర శ్రీగిరి, శ్రీచక్రరాజసింహసనే, శివనామస్మరణ, శంకరా శశిధర, శ్రీచక్రరాజ సింహాసనే మొదలైన పలుగీతాలు, అష్టకాలు సి.ఎం. హరిప్రియ ఆలపించారు. ఈ కార్యక్రమానికి వయోలిన్ సహకారాన్ని చక్రపాణి, మృదంగ సహకారాన్ని జి. గణేశ్, తబలా సహకారాన్ని శ్రీరామ్, తాళం సహకారాన్ని జి. వెంకటేశ్ అందించారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తి రంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి.

శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాల నిర్వహించబడుతున్నాయి.

## "సాల్ట్" ప్రాజెక్టుపై పాఠశాల విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నాణ్యమైన విద్యాబోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సి ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సహకారంతో అమలవుతున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ ఫర్మేషన్ (SALT) ప్రాజెక్టు అమలుతీరుపై పాఠశాల విద్య అధికారులు, సంబంధిత ఏజన్సీల ప్రతినిధులతో ఉండవల్లి నివాసంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో సాల్ట్ ప్రాజెక్టు అమలులో వెనుకబడటంపై కారణాలను తెలుసుకున్నారు. నాడు-నేడు, సాల్ట్ వంటి పథకాలపై గత ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుచేసినట్లు కాగితాల్లో చూపుతోందని, అదే నిజమైతే గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలమంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. దీనిపై లోతైన విశ్లేషణ చేసి, నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాల సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. రాబోయే అయిదేళ్లలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ నెట్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో ఎసెస్ మెంట్ మరింత శాస్త్రీయంగా ఉండేవిధంగా డిజైన్ లో మార్పులు చేయాలని ప్రథమ్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. డిజిటలైజ్డ్ ఎసెస్ మెంట్ ను మరింత సమర్థవంతంగా నిర్వహించి ఆన్ లైన్ కు అనుసంధానించడంపై దృష్టిసారించాలని ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ సంస్థను ఆదేశించారు. టీచింగ్ టూల్స్ అబ్జర్వేషన్, ఆబ్జెక్టివ్ ఓరియంటెడ్ బోధనాపద్ధతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ (ఎల్ఎఫ్ఇ) ప్రతినిధులకు సూచించారు. ఆయా ఏజన్సీలు నిర్వహిస్తున్న ఎసెస్ మెంట్, శిక్షణా కార్యక్రమాలు అర్థవంతంగా, ఫలితాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని అన్నారు. ఇంటర్మీడియట్ లో మార్కులకు బదులుగా గ్రేడింగ్ విధానాన్ని అమలుచేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు ప్రజాప్రతినిధులంతా మోడల్ పిటిఎం సమావేశాలకు హాజరై తల్లిదండ్రుల మనోగతాన్ని తెలుసుకుంటామని, ప్రభుత్వ పాఠశాలల మెరుగైన పనితీరు కోసం తల్లులను భాగస్వాములను చేయాలని అన్నారు. బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, డైరక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు, పిడబ్ల్యుసి ప్రతినిధులు సుచీంద్ర కుమార్, సోనాల్ శివగుండే, సునీత, కె.సురేష్ బాబు (ప్రథమ్), దత్తాత్రేయ, మజీద్ (ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్), వైభవ్ పాండే, నాగ సాయికృష్ణ(కైవల్య ఫౌండేషన్), సిద్దేష్ శర్మ (లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ) తదితరులు పాల్గొన్నారు.

## ఇక నుండి ATM లో రేషన్ బియ్యం..!!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏటీఎం నుంచి నగదు డబ్బులు తీసుకోవటం మీరు చూసిఉంటారు. కానీ, ఇప్పుడు ఏటీఎం నుంచి రేషన్ బియ్యం కూడా తీసుకోవచ్చు.?ఇందుకు సంబంధించి దేశంలోనే తొలి బియ్యం ఏటీఎం మిషన్ ప్రారంభ మైంది. ఒడిశాలో ఏర్పాటు చేసిన ఈ ఏటీఎం మిషన్ నుంచి బియ్యాన్ని తీసుకో వచ్చు. వినడానికి వింతగా అనిపించినా ఇది నిజం. ఒడిశా ప్రభుత్వం భువ నేశ్వర్ లోని ముంచేశ్వర్ ప్రాంతంలోని గోదాములో ఈ నూతన బియ్యం ఏటీఎంను ప్రారంభించింది. రేషన్ లబ్ధిదారులు తమ రేషన్ కార్డు నెంబర్ ను బియ్యం ఏటీఎం స్క్రీన్ పై నమోదు చేయాలి. ఆ తరువాత వేలిముంద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తరువాత ఏటీఎం నుంచి వచ్చే బియ్యాన్ని బస్తాలో నింపుకోవచ్చు. ప్రతీ రేషన్ కార్డు లబ్ధిదారుడు ఏటీఎం ద్వారా ఒకేసారి 25 కిలోల బియ్యాన్ని పొందవచ్చు. ఈ విధానం ద్వారా బియ్యం కోసం రేషన్ దుకాణాల ముందు గంటల తరబడి నిలబడాల్సిన అవసరం ఉండదు. అంతేకాక అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. ప్రయోగాత్మకంగా భువనే శ్వర్ లో ఈ బియ్యం ఏటీఎంను ప్రారంభించారు. ఒడిశాలోని మొత్తం 30 జిల్లాల్లో ఈ రేషన్ బియ్యం ఏటీఎంలను తెరిచే యోచన లో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం ఈ మోడల్ విజయ వంతం అయితే.. రేషన్ కార్డు పథకం కింద ఇతర రాష్ట్రాలకు ఈ విధానం విస్తరించనుంది.

## బైక్ పై తెచ్చి.. ఫీడర్ అంబులెన్స్‌లో వెళుతుండగా గిరిజన మహిళ డెలివరీ



**మన్యం (జర్నలిస్టు ఫైల్) :** షెడ్యూల్డ్ గిరిజన గ్రామం వీరమాసీలో ఓ గర్భిణికి ప్రసవ నొప్పులు ప్రారంభమయ్యాయి. సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కడ నుండి 10 కిలోమీటర్లు మోటారు బైకుపై తీసుకువెళుతుండగా, మార్గమధ్యంలో పీడరంబురల్స్ ఎదురు రావడంతో గర్భిణీనీ అందులో ఎక్కించారు. మరో 5 కిలోమీటర్లు దూరంలో ఆసుపత్రికి చేరుద్దామన్న ముందే అంబులెన్స్ లో డెలివరీ కావలసిన దుస్థితి ఏర్పడింది. సంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం సంబర పంచాయతీ వీరమాసి షెడ్యూల్డ్ గ్రామానికి చెందిన చౌడిపల్లి ఉత్తర భార్య బుల్లి గర్భవతి కావడంతో ఉదయం పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో భర్త ఉత్తర అంబులెన్స్‌లకు ఫోన్ చేస్తున్నప్పటికీ ఆలస్యం కావడంతో ఇంటి నుండి డోలితో నంద గ్రామానికి తీసుకువచ్చి అక్కడ నుంచి ఏ వాహనాలు లేకపోవడంతో మోటార్ బైక్ సహాయంతో పెద్దవలస గ్రామం వరకు తీసుకువెళ్లారు. అక్కడకు పీడర అంబులెన్స్ రావడంతో గర్భిణీని ఎక్కించారు. కొద్ది దూరం వెళ్ళాక అంబులెన్స్ మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం సంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు.

## రవాణా శాఖలో ప్రక్షాళనకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక ఆదేశాలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** రవాణా శాఖలో ప్రక్షాళనకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రి చర్చించారు. రవాణా శాఖలో కొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా శాఖలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని సీరియస్ అ-య్యారు. గత ఐదేళ్లలో చౌకబియ్యం కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలి వెళ్లాయని ఆరోపించారు. అక్రమంగా వెళ్తున్న వాహనాలను పట్టుకోకపోవడమేంటని ఆర్టీఏ అధికారులను ప్రశ్నించారు. గతంలో రాష్ట్రంలో అక్రమంగా ఇసుక, ఖనిజాలు తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేయకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. అక్రమంగా ఇసుక, మైన్స్ తరలింపు వాహనాలపై చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో ఒకే నెంబర్‌తో పలు వాహనాలు తిరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. నిరంతరం తనిఖీలు చేసి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీఏ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లలో రవాణా శాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం సమూల ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు.

రవాణాశాఖలో అవినీతి, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అక్రమార్కుల పనిపట్టి ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వైసీపీ పాలనలో ఆర్టీసీలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల వల్ల 2019-24 మధ్య ఆర్టీసీ నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం చెల్లించని బకాయిలు, సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. అమరావతి బ్రాండ్ ఎసీ బస్సులను పూర్వవైభవం తీసుకువస్తామని ఉద్ఘాటించారు. ఒవర్ లోడ్, ఫిట్ నెస్ లేకుండా, తిరుగుతున్న వాహనాలపై తనిఖీలు చేసి జప్తు చేయాలని అధికారులకు ఆదేశాలు విడుదల చేశారు. ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్లు, సిబ్బంది కొరత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లలో పరిశుభ్రతను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కారుణ్య నియామకాల్లో జాప్యాన్ని నివారించి వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

## పూర్ణపాడు లాభేసు వంతెనను పూర్తి చేస్తాం : సిఎం చంద్రబాబు



**మన్యం (జర్నలిస్ట్ ఫైల్) :** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గ పరిధిలో గల కొమరాడ మండలంలో ఉన్న పూర్ణ పాడు లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. విజయవాడలో జరిగిన ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకల్లో ఆయన పాల్గని ప్రసంగించారు. ఈ సందర్భంగా కొమరాడ మండలంలోని దీర్ఘకాల సమస్యగా ఉన్న వంతెన పనులు పూర్తి చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో గిరిజన ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే వంతెన 70 శాతం పనులు జరిగాయని ఇప్పుడు కూడా టిడిపి ప్రభుత్వం హయాంలోనే వంతెన పనులు పూర్తి చేస్తామని టిడిపి ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి కూడా గతంలో హామీ ఇవ్వడంపై గిరిజన సంఘాలు, గిరిజన ప్రజలు టిడిపి ప్రభుత్వానికి కఅతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. ఏది ఏమైనా వంతెన నిర్మాణం పూర్తయితే తొమ్మిది పంచాయతీల ప్రజలతో పాటు మూడు మండలాల ప్రజలకు అటు ఒడిశా రాష్ట్రం ప్రజలకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. వంతెన నిర్మాణం పై ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంపై ఈ ప్రాంత ప్రజలు చంద్రబాబును అభినందిస్తున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే తెలిపారు

## విత్తనాల కోసం రైతులు తిప్పలు పడుతున్నారు : వైఎస్ షర్మిల



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విత్తనాల కోసం రైతులు తిప్పలు పడుతున్నారని.. క్యూలైన్లు కడుతుంటే ప్రభుత్వానికి కనిపించట్లేదా అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. విత్తనాల కొరతపై వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణ తలా తోక లేకుండా ఉందని విమర్శించారు. సాగర్ కుడికాలువ కింద రైతులకు విత్తన కొరత లేదని గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పగలరా..? అని నిలదీశారు. కూటమి ప్రభుత్వంపై వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. పల్నాడు జిల్లాలో కౌంటర్ల దగ్గర రైతుల పడుతున్న కష్టాలు మీకు కనిపించడం లేదా..? సంబంధిత శాఖ మంత్రిగా నేరుగా పరిస్థితి చూసే మాట్లాడుతున్నారా..? రాత్రంతా క్యూలైన్లో రైతులను నిలబెట్టడమా మీ ఎన్డీఏ ప్రభుత్వ కట్టుబడి ఇదేనా..? సంక్షోభం నుంచి సంక్షేమం అంటే కుండపోత వర్షంలో మహిళలను ఇబ్బందులు పాలు చేయడమే కాబోలు! రైతుల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ము లేక కుటుంబాన్ని గుంజుతున్నారు. %జూ% ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టకనే కదా.. మీకు పట్టం కట్టింది. మాజీ సీఎం జగన్ నిండా ముంచారు అనే కదా 11 సీట్లకు పరిమితం చేసింది. మోసం చేశారు అనే కదా కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. రైతులను వ్యతిరేకించే బీజేపీతో మీరు కూటమి కట్టి, పక్షపాతిగా ఉంటామని హామీలు ఇచ్చి, గద్దెనెక్కి, ఇప్పుడు వాళ్లను వర్షంలో నిలబెట్టారు. ఇది మీ సర్కారుకి న్యాయమా..? నాట్లు వేసిన 130 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని జేజీఎల్:384 రకం విత్తనాలను కావాలని అడగటం రైతులు చేసిన పాపం అంటారా మంత్రిగారు! రైతు అడిగింది ఇవ్వాలని హక్కుగా మేము ప్రశ్నిస్తే.. రెచ్చ గొట్టినట్లు ఎలా అవుతుందో, వ్యవసాయ శాఖ మంత్రిగారు సమాధానం చెప్పాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

## ఏపీలో కూటమి ప్రభుత్వంపై జగన్ సంచలన వ్యాఖ్యలు

**నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలో కూటమి ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. "రాష్ట్రవ్యాప్తంగా రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారు. ఊళ్లలో ఆధిపత్యం కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. రాళ్లు, రాడ్లు, కత్తులతో గ్రామంలో దాడులు చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతుంది. చంద్రబాబు మహిళలను మోసం చేశారు. ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పారు. మన ప్రభుత్వమే ఉండి ఉంటే ఇప్పటికే అందరికి రైతు భరోసా అందేది" అని వైఎస్ జగన్ అన్నారు.

నంద్యాల జిల్లా సీతారామాపురంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బారాయుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లారు. పరామర్శ అనంతరం మీడియాతో మాట్లాడారు.



**అరాచక పాలన సాగుతోంది**

రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అడుగుతారేమోనని సీఎం చంద్రబాబు భయానకం వాతావరణ కల్పిస్తున్నారంటూ జగన్ తనదైన శైలిలో ఆరోపణలు చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇంటింటికి టీడీపీ వాళ్లను పంపించి అనేక హామీలు ఇస్తామని చెప్పించారని, కానీ అధికారంలోకి రాగానే మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జగన్ అధికారంలో ఉండుంటే ప్రతి రైతుకు సొమ్ము అందేదని, అందరికీ సంక్షేమ పథకాలు అందేవని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆధిపత్యం కోసం దాడులు చేస్తూ లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టిస్తున్నారని, సీతారామాపురంలో సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు పోలింగ్ బూత్‌లో ఏజెంటుగా కూర్చున్నాడని, అతడిని దారుణంగా హత్య చేశారని ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా అని అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. నారపురెడ్డి అనే వ్యక్తి ఎస్సైకి ఫోన్ చేసినా పోలీసులు సకాలంలో స్పందించ లేదని, కొంతసేపటికి ఎస్సై ఊరికి వచ్చినా పైఅధికారులకు ఫోన్లు చేస్తూ ప్రేక్షక పాత్ర పోషించారని నిందలు వేశారు. నారపురెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసినా పోలీసులు అదనపు బలగాలను పంపలేదని అన్నారు.

**ఎమ్మెల్యే బుడ్డారెడ్డి హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు**

సుబ్బరాయుడుని హత్య చేసిన వారిని పోలీసులు వెంటనే ఎందుకు అరెస్టు చేయలేదని జగన్ ప్రశ్నించారు. నిందితుల కాల్ డేటా బయటకు తీస్తే అసలు వ్యక్తులు వెలుగులోకి వస్తారని, కేవలం మర్డర్ చేసిన వారిపైనే కాదు, హత్య చేయించిన వారిపై కూడా కేసులు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. సీతారామాపురంలో హత్యకు గురైన సుబ్బారాయుడు కుటుంబానికి అండగా ఉంటానని, నిందితులకు కఠిన శిక్షపడేంత వరకు న్యాయ పోరాటం చేస్తానని అన్నారు.

ఇక సుబ్బరాయుడు కుటుం బానికి ప్రాణ రక్షణ కల్పించాలని జగన్ డిమాండ్ చేశారు. ఇక శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి హత్యా రాజకీయా లను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపణలు గుప్పిం చారు. మండలానికి ఇద్దరిని చంపాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మీటింగ్‌లో చెప్పారని, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని మాజీసీఎం అన్నారు. బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయ లేదని ఆయన ప్రశ్నించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467